ఉగాది.. సందడి

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): షడ్రుచుల సమ్మేళనం మన జీవిత గమనానికి నిదర్శనమని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు.జిల్లా సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం శ్రీవెంకటేశ్వ ర ఆనంకళా కేంద్రంలో ఆదివారం జరిగిన శ్రీవిశ్వావసు నామ సంవత్సర ఉగాది ఉత్సవాన్ని ప్రారంభించి మాట్లాడారు.రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించుకుంటున్నామని చెప్పారు. ఉగాది తెలుగు వారి పండుగ అన్నారు. ఈ ఉగాది -మన సంకల్పం అనే కవితను కలెక్టర్ చదివి వినిపించారు.ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ తెలుగు వారి పండుగను అధికారికంగా నిర్వహించిన సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. ప్రతిరోజు పంచాగ శ్రవణం చేస్తే గంగానదిలో స్నానం చేసినంత పుణ్యం దక్కుతుందన్నారు.అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ కూట మి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే ఉగాది వేడుకలు ఇంత ఘనంగా నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ ఇటువంటి పండుగలు ప్రభుత్వం నిర్వహించడం ద్వారా భవిష్యత్తరాలకు మన సంస్కృతి సాంప్రదాయాలను వారసత్వంగా అందించడం సాధ్యమవుతుందన్నారు.తొలుత శుభమంగళ నాదస్వరం కె.వెంకటేశ్వర్లు అందించారు.సిద్ధాంతి ఏవీఎన్‌డీ శ్రీనివాసులు పంచాగ శ్రవణం చేశారు.శ్రీవిజయశంకర ప్ర భుత్వ సంగీత కళాశాల బృందం వారిచే సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. వేడుకల్లో జేసీ ఎస్.చిన్నరాముడు,డీఆర్వో టి.సీతారామ్మూర్తి,ఆర్‌డీవోలు ఆర్.కృష్ణనాయక్,రాణి సు స్మిత,ఇన్‌చార్జి జిల్లా దేవాదాయ అధికారి తోట సుబ్రహ్మణ్యం,కేఆర్ఆర్‌సీ ఎస్డీసీఎస్ భాస్కరరెడ్డి,సీపీవో ఎల్.అ ప్పలకొండ,వ్యవసాయాధి కారి మాధవరావు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసును దీవిస్తున్న తండ్రి అప్పారావు

ఉగాది ఉత్సవంలో కలెక్టర్ ప్రశాంతిని సత్కరిస్తున్న సన్మానగ్రహీతలు చిత్రంలో ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి , ఎమ్మెల్సీ సోము, జేసీ చిన్నరాముడు, ఆర్‌డీవో కృష్ణనాయక్ తదితరులు

జ్యోతి ప్రజ్వలన చేసి ఉగాది ఉత్సవాలను ప్రారంభిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి

ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి దంపతులకు సత్కారం

బిక్కవోలు లక్ష్మీగణపతికి భక్తజనం పూజలు



ప్రత్యేక అలంకరణలో కోటసత్తెమ్మ

ఎంపీ పురందేశ్వరి ఆధ్వర్యంలో ఉగాది ఉత్సవం

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : శ్రీ విశ్వావసునామ సంవత్సరంలో అందరికీ మంచి జరగాలి. అందరూ ఆనందంగా ఉండాలి అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. రాజమహేంద్రవరం జేఎన్ రోడ్డులోని ఒక ప్రైవేట్ ఫంక్షన్‌హాలులో ఆదివారం ఎంపీ పురందేశ్వరి ఆధ్వర్యంలో ఉగాది ఉత్సవం నిర్వహించారు.వివిధ రంగాలకు చెందిన 60 మంది ప్రముఖులకు ఉగాది పురస్కారాలు అందజేసి సత్కరించారు. విశ్వావసు అంటే సంపదలన్నీ ఇచ్చే విష్ణుమూర్తి అని అన్నారు. జ్యోతిష ప్రవీణ పుల్లెల సత్యనారాయణ పంచాంగ శ్రవణం చేశారు. ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, బత్తుల బలరామకృష్ణ, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మద్దిపాటి వెంకట్రాజు, బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యుడు సోము వీర్రాజు, అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఎన్‌బీఎం మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మెగా ప్రాజెక్టులు.. పడక!



చూసే వారు లేక : ఆదుర్రులో పూర్తయిన తరువాత నిరుపయోగంగా వదిలేసిన పర్యాటక భవనం

ఎవరికి పట్టింది : ముక్కలవుతున్న చెక్క వంతెన

పర్యాటకులను మంత్రముగ్ధులను చేసే లక్ష్యంతో కోట్ల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న పర్యాటక భవనాలు వినియోగంలోకి రాకుండానే శిథిలావస్థకు చేరుతున్నాయి. సర్వాంగ సుందరంగా నిర్మాణాలు పూర్తి చేసిన భవనా లను పర్యాటకుల సౌకర్యార్థం వినియోగంలోకి తీసుకురావడంలో పర్యాటకశాఖ అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారు. నిర్మాణ సమయాల్లోనే నిధులు కాజేస్తూ ఆ తర్వాత భవన సముదాయాలను గాలికి వదిలేస్తున్నారు.. సుమారు పదేళ్ల కిందట కేంద్ర పర్యాటక మంత్రిగా ఉన్న చిరంజీవి సుమారు రూ.27 కోట్ల వ్యయంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రారంభించిన పనులు ఎక్కడికక్కడ అటకె క్కాయి.. చాలా భవనాలు ప్రారంభించకుండానే శిథిలమై దీనంగా చూస్తున్నాయి.. ప్రస్తుత ప్రభుత్వంలో డిప్యూటీ సీఎంగా ఉన్న పవన్ కల్యాణ్ మెగా పర్యాటక ప్రాజెక్టులపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

పర్యాటక శాఖ తీవ్ర నిర్లక్ష్యం

- చిరంజీవి ప్రాజెక్టులపై చిన్నచూపు
- పదేళ్ల కిందట పర్యాటక పనులు
- నాడు కేంద్ర మంత్రిగా శంకుస్థాపన
- ఉమ్మడి జిల్లాలో సాగని నిర్మాణాలు
- రూ.25 కోట్లతో ఆరంభం
- కోనసీమలో అయితే దారుణం
- కాకినాడలో అటకెక్కిన నిర్మాణం
- తూర్పున పునాది దాటని వైనం

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

మెగా ప్రాజెక్టులు పడకేశాయి.. ఒక్కచోట కూడా పరిస్థితి సంతృప్తికరంగా లేదు.. కాకినాడ జిల్లాలో జిల్లాలో స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయింది..కోనసీమ జిల్లాలో భవన నిర్మా ణాలు పూర్తయినా పర్యాటక అధికారుల నిర్లక్ష్యం కారణంగా శిథిలావస్థకు చేరుతున్నాయి. ఇక తూర్పుగోదావరి జిల్లా కడియపులంకలో చేపట్టిన ఎకో టూరిజం ప్రాజెక్టు పునాది దశను దాటలేదు. ఇలా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మెగా ప్రాజెక్టులు పడకేశాయి.కాకినాడ జిల్లాలో స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ కలగానే మారింది. శంకుస్థాపన చేసి పదేళ్లు పూర్తయినా ఇప్పటికీ ప్రారంభానికి నోచుకోక వెక్కిరిస్తోంది. 2015లో కేంద్ర ప్రభుత్వం ఇక్కడ సంస్థ ఏర్పాటుకు రూ.12 కోట్లు నిధులివ్వడానికి ముందుకు వచ్చింది. అప్పటి నుంచి ఇప్పటివరకు భవన నిర్మాణ పనులు సా...గుతూనే ఉన్నాయి. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో రాష్ట్రవిభజన సమ యంలో కేంద్ర ప్రభుత్వం హోటల్ మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ మంజూరు చేసింది. అప్పట్లో కేంద్ర పర్యాటకశాఖ మంత్రిగా ఉన్న చిరంజీవి దీన్ని జిల్లాకు కేటాయించారు. కేంద్రం నుంచి రూ.12 కోట్లు నిధులు మంజూరయ్యాయి. 2015 ఏప్రిల్‌లో పిఠాపురం నియోజకవర్గం పరిధిలోని ఉప్పాడ కొత్తపల్లిలో హైస్కూలుకు చెందిన 16 ఎకరాల స్థలం కేటాయించారు.కొందరు భూమి కేటాయింపుపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ కోర్టును ఆశ్రయించడంతో మూడు ఎకరాలు కేటాయించేలా న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసి వివాదానికి ముగింపు పలికింది.ఇది జరిగి దాదాపు ఐదేళ్లపైనే దాటిపోయింది.అయినా ఇప్పటికీ నిర్మాణానికి నోచుకోకుండా వెక్కిరిస్తోంది. కాకినాడతో పాటే తిరుపతిలో కేంద్రం నిధులతో రాష్ట్రపర్యాటక అభివృద్ధి సంస్థ నిర్మించిన హోటల్ మేనేజ్‌మెంట్ విద్యాసంస్థ అద్భు తంగా రాణిస్తోంది.ఇక్కడ మాత్రం ఇంకా ఆరంభం కాకుండా అలాగే ఉంది. సార్వత్రిక ఎన్నికలకు కొన్ని నెలల ముందు రాష్ట్ర పర్యాటక అభి వృద్ధి సంస్థ కళ్లు తెరిచి దీన్ని పూర్తి చేయడానికి రూ.6.74 కోట్లతో టెండర్లు పిలిచింది.ఒక కాంట్రాక్టర్ పనులు ఆరంభించినా తర్వాత బిల్లులు ఆగిపోవడంతో భవనాల పనులు మధ్యలో వదిలేశారు. కూటమి ప్రభుత్వం దృష్టి సారించి సీఎం చంద్రబాబు,ప్రస్తుత పిఠాపురం ఎమ్మెల్యే, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నిర్మాణాలపై దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.దీనిపై పర్యాటక శాఖ డీఈని వివరణ కోరగా భవనానికి కేంద్రం నుంచి నిధులు రావాల్సి ఉందన్నారు. హాస్టల్ భవనాల పనులు త్వరలో ఆరంభిస్తామన్నారు.



ఇంతేనా : ఉప్పాడ కొత్తపల్లిలో అసంపూర్తిగా వదిలేసిన హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల భవనం

అందంగా కట్టారు.. శిథిలస్థితికి చేర్చారు!

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

పర్యాటక శాఖ నిర్లక్ష్యం కారణంగా పలు ప్రా జెక్టులు ముందడుగు పడడంలేదు. నిధులున్నా నీరసంగా నడుస్తున్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని మామిడికుదురు మండలం ఆదుర్రు బౌద్ధస్థూపం సమీపంలో నిరుపయోగంగా వదిలేసిన భవనాలు పర్యాటక శాఖ అధికారుల పనితీరుకు అద్దంపడుతున్నాయి.వైనతేయ నదీ తీరాన ఆదుర్రు బౌద్ధ స్థూపాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసే సంకల్పంతో తొమ్మిదేళ్ల కిందట రూ.6 కోట్లతో పర్యాటకుల విడిది భవనాలను నిర్మించారు. మడ అడవుల చెంతన ఓ వైపు గోదావరి మరో వైపు ఆదుర్రు బౌద్ధ స్థూపాలు ఉన్న ప్రాంతంలో వీటిని పర్యాటకశాఖ నిర్మించింది. పాశర్లపూడి నుంచి ఆదుర్రు బౌద్ధ స్థూపానికి నాలుగు కిలోమీటర్ల దూరం ఉంటుంది. పాశర్లపూడి వైపు వైనతేయ వంతెన కింద మరో భవనాన్ని నిర్మించారు.ఇక్కడి నుంచి ఆదుర్రుకు వైనతేయ నదిలో నాలుగు కిలోమీటర్ల మేర ప్రయాణించేందుకు రూ.కోటి పైబడిన వ్యయంతో అత్యాధునిక సౌకర్యాలతో కూడిన ఒక బోటు కొనుగోలు చేశారు. పాశర్లపూడి వైపు ఉన్న పర్యాటక భవనాన్ని ప్రైవేటు వ్యక్తులకు లీజుకిచ్చామని చెబుతున్నా అవి ఉపయోగంలో లేవు. ఆధునిక సౌకర్యాలతో కొనుగోలు చేసిన బోటు ఉపయోగంలో లేదు. ఆదుర్రులో గోదావరి నది చెంత నుంచి పర్యాటక భవనాలకు చేరుకునేందుకు వీలుగా అందంగా చెక్కలతో నిర్మించిన వంతెన ఇప్పుడు శిథిలస్థితికి చేరింది. ఆ భవనాల్లో తుప్పలు, చెట్లు పెరిగిపోయాయి. రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన భవనాలను గాలికొదిలేయడంపట్ల పర్యాటకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భవనాలు గాలికొదిలేసిన పర్యాటక అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆరేళ్లకే.. నిండు నూరేళ్లు!

గౌతమి గోదావరి తీరాన నిర్మించిన భవనాలు శిథిలమవుతున్నాయి. కోటిపల్లి రేవు చెంతనే అప్పటి కేంద్ర పర్యాటక శాఖ మంత్రి చిరంజీవి కోటిపల్లి రేవులో భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.ఈ భవన నిర్మాణాలకు అప్పటి మంత్రి యనమల రామకృష్ణుడు 2019 జనవరి 7న ప్రారంభించారు. కోటిపల్లి రేవులో రూ.2.14 కోట్లతో నిర్మించిన రెండు ప్రత్యేక భవనాలు ప్రారంభించి ఆరేళ్లు కావొస్తున్నా వినియోగంలోకి రాలేదు. పర్యాటకంగా అభివృద్ధి చెందితే కోటిపల్లి రేవు తీరప్రాంతం ఎంతో అభివృద్ధి చెందేది. రేవు చెంతనే కోటిఫలీశ్వరస్వామి ఆలయం, దగ్గరలో ద్రాక్షారామ భీమేశ్వరస్వామి ఆలయాలు ఉండడం, రేవులో నిత్యం వందల మంది ప్రయాణించడంతో ఎప్పుడూ ఈ ప్రాంతం కళకళలాడుతూ ఉంటుంది. కోట్లు వెచ్చించి ఖర్చు పెట్టి నిర్మించిన భవనాలు ఉపయోగించకపోవడంతో చెట్లు, తుప్పలు, పిచ్చిమొక్కలు పెరిగి నిరుప యోగంగా మారాయి.




అందంగా కట్టారు.. వదిలేశారు : కోటిపల్లి రేవులో నిరుపయోగంగా వదిలేసిన పర్యాటక భవనం

కడియంలో ఎకో నారాయణ?



పునాదిలోనే ఆగింది : కడియపులంకలో పునాది దాటని ఎకో టూరిజం ప్రాజెక్టు

కడియం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : పర్యాటక అభివృద్ధిలో భాగంగా కడియపు లంకలో ఆరం భమైన ఎకో టూరిజం ప్రాజెక్టు అటకెక్కింది. ఎకో టూరిజం భవన నిర్మాణానికి 2014 ఫిబ్రవరి 9న చిరంజీవి స్వయంగా శంకుస్థాపన చేశారు.కేంద్రం రూ.5 కోట్లు మంజూరు చేయ డంతో పనులు కూడా ప్రారంభించారు. ఇక ఈ ప్రాంతానికి టూరిజం శోభ వచ్చేసిందని ఆనందపడే లోపు పునాది దశలోనే ప్రాజెక్టు నిలిచిపోయింది. దశాబ్దకాలంగా ఎక్కడి నిర్మాణాలు అక్కడే ఆగిపోయాయి. గత వైసీపీ ప్రభు త్వంలో ఈ ప్రాజెక్టు వైపు చూసిన వారే కానరాలేదు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలని నర్సరీరైతులు కోరుతున్నారు.



నాడు మాట్లాడుతున్న మెగాస్టార్ చిరంజీవి



ముస్లింలకు కలెక్టర్ రంజాన్ శుభాకాంక్షలు



రాజమహేంద్రవరం సిటీ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఉన్న ముస్లిం సోదరులకు కలెక్టర్ ప్రశాంతి ఆదివారం రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రంజాన్ పండుగను ముస్లిం సోదరులంతా వారి వారి కుటుంబాలతో సంతోషంగా నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు.

నేడు పీజీఆర్ఎస్ రద్దు

రంజాన్ ప్రభుత్వ సెలవు కావడం వల్ల ఈ నెల 31 సోమవారం జరగాల్సిన పీజీఆర్ఎస్ రద్దు చేశామని పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోనే కాకుండా ఎక్కడా పీజీఆర్ఎస్ నిర్వహించరన్నారు.ఈ మేరకు అర్జీదారులు గమనించాలన్నారు.

డీసీహెచ్ఎస్ పద్మశ్రీరాణి బదిలీ?

కొవ్వూరు,మార్చి 30 (ఆంధ్రజ్యోతి) తూర్పుగోదావరి జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారిని డా.ఎస్.పద్మశ్రీరాణి బదిలీపై విజయనగరం వెళ్లనున్నారు. రాష్ట్రంలో 8 మందికి డీసీహెచ్ఎస్‌లుగా పదోన్నతి కల్పిస్తూ ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో పద్మశ్రీరాణి బదిలీపై వెళ్లనున్నారు. ఆమె స్థానంలో పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం నుంచి డా. హెచ్.పద్మ రానున్నట్టు సమాచారం. అధికారికంగా ఉత్తర్వులు వెలువడాల్సి ఉంది.



4న చిత్ర కళా వీధి ప్రదర్శన

రాజమహేంద్రవరం,మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఏప్రిల్ 4న రాజమహేంద్రవరంలో అమరావతి చిత్రకళా వీధి ప్రదర్శన నిర్వహించనున్నారు. ఇది ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనే తొలి ప్రదర్శన. ఇటువంటి వీధి ప్రదర్శన బెంగళూరులో చాలాకాలంగా జరుగుతుంది. రాజమహేంద్రవరంలోని దామెర్ల రామారావు ఆర్ట్ గ్యాలరీని అభివృద్ధి చేసి మరింత ప్రాచుర్యంలోకి తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది.దీనిలో భాగంగా రాష్ట్ర పర్యాటక మంత్రి కందుల దుర్గేష్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మక,సాంస్కృతిక సమితి చైర్‌పర్సన్ పొడపాటి తేజస్వి ఆధ్వర్యంలో అమరావతి చిత్రకళా వీధి ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నారు. రాజమహేంద్రవరంలో ఏప్రిల్ 4న ఉదయం 9 నుంచి సాయం త్రం 5 గంటల వరకూ ఆర్ట్స్ కాలేజీ నుంచి జీజీహెచ్ వరకూ సుమారు కిలో మీటరు మేర రోడ్డుకిరు వైపులా స్టాల్స్ ఏర్పాటు చేసి ప్రదర్శించనున్నారు. ఈ మేరకు మంగళవారం నుంచి ఏర్పాట్లు చేస్తారు. ఈ ప్రదర్శనకు సుమారు 500 చిత్ర, శిల్ప, హస్తకళాకారులు హాజరు కా నున్నారు.వీధి ప్రదర్శనలో వివిధ కళాకారుల చిత్రాలను విక్రయిస్తారు. వీటి ద్వారా వచ్చే ఆదాయాన్ని దామెర్ల రామారావు ఆర్ట్ గ్యాలరీ అభివృద్ధికి వినియోగించనున్నారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామ కృష్ణం రాజు, మంత్రి దుర్గేష్ హాజరవుతారు.



పి-4కు తరలిన బస్‌లు

రాజమహేంద్రవరం, మార్చి30(ఆంధ్రజ్యోతి) : జీరో పావర్టీ - పీ4 మార్గదర్శి (బంగారు కుటుంబం) పేరుతో అమరావతిలో ఆదివారం రాత్రి సీఎం నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో నిర్వహించనున్న కార్యక్రమానికి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి 13 బస్సుల్లో 500 మంది బయలుదేరి వెళ్లారు. రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు 20 శాతంగా ఉన్న పేదలకు 10 శాతంగా ఉన్న సంపన్న వర్గాల ద్వారా సహాయం చేసి అభివృద్ధిలోకి తీసుకుని రావడానికి పీ-4 కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. రాజమహేంద్రవరం ఆనం కళాకేంద్రం వద్ద ఆదివారం ఈ బస్సులను కలెక్టర్ పి.ప్రశాంతి ప్రారంభించారు.

అనపర్తి మండలం రామవరంలో పలువురు వైసీపీ నాయకులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఉగాదిని పురస్కరించుకుని కార్మిక శాఖ మంత్రి సుభాష్ సమక్షంలో ఎంపీటీసీ సభ్యులు తదితర నాయకులు టీడీపీలో చేరారు. ఆయా నాయకులకు మంత్రి సుభాష్ టీడీపీ కండువాలు కప్పి నియోజకవర్గ కన్వీనర్ మనోజ్‌రెడ్డి సమక్షంలో పార్టీలోకి ఆహ్వానించారు. 7



కడియంలో శాంతిర్యాలీ



పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతికి సంతాపంగా ఆదివారం కడియంలో భారీ శాంతి ర్యాలీ చేశారు.. సుమారు 2 వేల మంది క్రైస్తవులు తరలివచ్చారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని పెద్ద ఎత్తున ప్రార్థనలు చేశారు.. 8


అయినవిల్లి శ్రీసిద్ధివినాయకస్వామి

విఘ్నాలు తొలగించే సిద్ధి వినాయకుడు

● భక్త జనసంద్రంగా అయినవిల్లి క్షేత్రం

అయినవిల్లి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): అయినవిల్లి శ్రీవిఘ్నేశ్వరస్వామివారి క్షేత్రానికి విశ్వావసు నామ సంవత్సరం ప్రారంభం ఉగాది సందర్భంగా భక్తులు పోటెత్తారు. తొలిపూజలు అందుకునే దైవం, విఘ్నాలు తొలగించి బుద్ధి, సిద్ధులను ప్రసాదించే విఘ్నేశ్వరున్ని నూతన సంవత్సరం సందర్భంగా దర్శించుకుంటే విఘ్నాలు తొలగుతాయని భక్తుల విశ్వాసం. ఉదయం నుంచి స్వామివారి దర్శనానికి భక్తులు క్యూ కట్టారు. క్యూలైన్లు, రహదారులు, ఆలయ మండపాలు, వీధులు భక్తులతో కిక్కిరిశాయి. పార్కింగ్‌కు స్థలం లేక వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు ముక్తేశ్వరం, రావులపాలెం, ముమ్మిడివరం వైపు వెళ్లే రహదారిపై టెంట్లు వేసి క్యూలైన్లు ఏర్పాటుచేశారు. ట్రాఫిక్‌ను బైపాస్ రహదారి మీదుగా మళ్లించారు. స్వామివారి దర్శనానికి మూడు గంటలు, అన్నప్రసాద స్వీకరణకు రెండు గంటలు సమయం పట్టింది. క్యూలైన్‌లో భక్తులకు తాగునీరు ఏర్పాటు చేశారు. ఆలయ సహాయ కమిషనర్ ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా సేవలు అందించారు. పంచాంగ శ్రవణం నిర్వహించారు.

హోటల్‌లోకి దూసుకుపోయిన కారు

● ఐదుగురికి తీవ్రగాయాలు

● బాలుడి పరిస్థితి విషమం


మండపేట బైపాస్‌రోడ్డులో హోటల్‌లోకి దూసుకుపోయిన కారు

మండపేట, మార్చి30(ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ కోనసీమజిల్లా మండపేట బైపాస్ రోడ్డులో ఆదివారం సాయంత్రం కారు బీభత్సం సృష్టించింది. జొన్నాడ నుంచి కాకినాడకు వెళుతున్న కారు మండపేట ఏడిద నాలుగు రోడ్ల బైపాస్ జంక్షన్‌కు వచ్చేసరికి కారు అదుపు తప్పింది. ఈ ప్రమాదంలో కపిలేశ్వరపురం మండలం వల్లూరు నుంచి దుళ్ల వెళుతున్న తండ్రి, కుమారులను కారు ఢీకొట్టి అక్కడే ఉన్న హోటల్‌లోకి దూసుకుపోయింది. ఈప్రమాదంలో హోటల్ నిర్వాహకురాలితోపాటు మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈసంఘటనకు సంబంధించి పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండపేట ఏడిద బైపాస్‌రోడ్డు వద్ద ఆదివారం నలుగురు వ్యక్తులతో జొన్నాడ నుంచి కాకినాడకు వెళుతున్న కారు అదుపు తప్పి కపిలేశ్వరపురం మండలం వల్లూరుకు చెందిన తండ్రీకొడుకులు పొడగట్లపల్లి రాంబాబు(42) కుమారుడు హెమంత్ (14)తో దుళ్లకు బయలుదేరాడు. వారు ఆదివారం సాయంత్రం బైపాస్‌రోడ్డు జంక్షన్ వద్ద రోడ్డు దాటే సమయంలో జొన్నాడ నుంచి వేగంగా దూసుకువచ్చిన కారు ఢీకొట్టిందన్నారు. ఈప్రమాదంలో రాంబాబుకు స్వల్పగాయాలు కాగా అతడి కుమారుడు హెమంత్‌కు తీవ్ర గాయాలయ్యాయని పోలీసులు తెలిపారు. తీవ్రంగా గాయపడ్డ హెమంత్‌ను కాకినాడ ఆసుపత్రికి తరలించారు. కారు పక్కనే వున్న పాకలో హోటల్ నిర్వహిస్తున్న నిర్వాహకురాలు మంచు లక్ష్మితోపాటు అక్కడవున్న పిట్టా సంతోష్, కుడిపూడి శ్రీనులు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డవారిని స్థానికులు మండపేట ప్రభుత్వ ఆసుపత్రికి 108లో తరలించారు. నలుగురు మండపేటలో చికిత్స పొందుతుండగా తీవ్రంగా గాయపడ్డ బాలుడిని కాకినాడకు తరలించారు. బాలుడి పరిస్థితి విషమయంగా ఉందని పోలీసులు తెలిపారు. ఈసంఘటనపై బాధితులు ఫిర్యాదు మేరకు కేసునమోదు చేస్తున్నామని పట్టణ ఇన్‌చార్జి ఎస్.ఐ చంటి తెలిపారు. కారు ఢీకొట్టిన ప్రమాదంలో హోటల్‌తోపాటు పలు ద్విచక్రవాహనాలు కూడా దెబ్బతిన్నాయని పోలీసులు తెలిపారు.


పుష్పాలంకరణలో సత్యదేవుడు


అనంతలక్ష్మి అమ్మవార్లు, దేవస్థానం పంచాంగం ఆవిష్కరిస్తున్న ఈవో సుబ్బారావు, చైర్మన్ రోహిత్

శ్రీ విశ్వావసు నామ సంవత్సరంలో

సత్యదేవుడి ఖ్యాతి మరింత ఇనుమడిస్తుంది

● రత్నగిరిపై ఘనంగా ఉగాది వేడుకలు

● ప్రత్యేక ఆకర్షణగా అలంకరణలు

అన్నవరం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): రత్నగిరిపై ఉన్న సత్యదేవుడికి శ్రీ విశ్వావసు నామసంవత్సరంలో స్వామిఖ్యాతి మరింత ఇనుమడిస్తుందని భక్తులకు మరిన్ని మెరుగైన సౌకర్యాలు అందుతాయని దేవస్థానం వేదపండితులు గొల్లపల్లి వెంకటరామ గణపతి పేర్కొన్నారు. ఉగాది పర్వదినం పురస్కరించుకుని అనివేటి మండపంలో ఆయన పంచాంగ పఠనం చేశారు. ముందుగా అనివేటి మండపాన్ని సుగంధభరిత పుష్పాలు, వివిధ ఫలాలతో తీర్చిదిద్దారు. వెండి సింహాసనంపై స్వామి,అమ్మవార్లను మరోవేదికపై క్షేత్ర పాలకులు సీతారాములను ఆశీనులు గావించి గణపతిపూజ, పుణ్యాహవచనం నిర్వహించగా దేవస్థానం ముద్రించిన పంచాంగాన్ని ఈవో వీర్ల సుబ్బారావు, చైర్మన్ రోహిత్‌లు ఆవిష్కరించారు. మఖ నక్షత్రజాతకులు అయిన సత్యదేవుడి ఆదాయం 11, వ్యయం 11 కాగా ఆదాయానికి తగ్గట్టుగా భక్తులకు సౌకర్యాల కల్పన జరుగుతుందన్నారు. పాడిపంటలు సమృద్ధిగా పండి సకల జీవకోటి సుఖసంతోషాలతో నిండిఉంటారన్నారు. ఈసందర్భంగా రాజమహేంద్రవరంకు చెందిన ఉప్పు లూరి సత్యనారాయణ అవధాని, పశ్చిమగోదావరిజిల్లాకు చెందిన గొల్లపల్లి వెంకటనాగ శ్రీరామ అవధానులను శాలువా కప్పి నగదు పారితోషికం అందించి పండిత సత్కారాలు గావించారు. అనంతరం భక్తులకు పంచాంగాలను ఉచితంగా పంపిణీచేసి ఉగాది పచ్చడి వితరణ గావించారు. చతుర్వేదపండితులు వేదస్వస్తితో పంచాంగశ్రవణం ముగించారు. 10గం టలకు తూర్పురాజగోపురం వద్ద స్వామి,అమ్మవార్లను వెండిరథంపై భక్తుల గోవిందనామస్మరణల నడుమ ము మ్మారు ప్రదక్షణ గావించారు. దేవస్థానం తూర్పురాజగోపురం వద్ద పుష్పాలంకరణతో ఏర్పాటుచేసిన పూర్ణకుంభం నమూనా భక్తులను విశేషంగా ఆకర్షించింది. ఆదివారం రాత్రి సత్యదేవుడు, అనంతలక్ష్మీ అమ్మవార్లకు కొండదిగువ వెండి గజవాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. ఈవో సుబ్బారావు, చైర్మన్ రోహిత్‌లు టెంకాయి కొట్టి గ్రామసేవ ప్రారంభించారు.



వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పోటెత్తిన భక్తులు

గోవిందనామస్మరణతో

మార్మోగిన వాడపల్లి

● ఆకట్టుకున్న పుష్పాలంకరణ ● అన్నదాన ట్రస్టుకు రూ.లక్ష విరాళం

ఆత్రేయపురం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉగాది పర్వదిన వేడుకలలో భాగంగా వివిధ రాష్ట్రాల నుంచి భక్తజనం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాన్ని వివిధ పుష్పాలతో ఉగాది శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆలయాన్ని అలంకరించారు. ధ్వజస్తంభం, ప్రకార మండపం, వసంత మండపంలలో ఫలపుష్పాలంకరణ నిర్వహించారు. ఫొటోషూట్ వద్ద భక్తుల సందడి నెలకొంది. అశేష భక్తజనం గోవిందనామస్మరణతో స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.5,14,245 లభించినట్టు ఉప కమిషనర్, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. కోనసీమ జిల్లా ఏఎస్పీ ఏపీఎల్ ఎంవీ ప్రసాద్ కుటుంబ సభ్యులతో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.. వేదపండితుల ఆశీర్వచనం అందుకున్నారు. స్వామివారి చిత్రపటం అందజేశారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అలాగే వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి పెనుగొండ మండలం సిద్ధాంతానికి చెందిన కనుకుర్తి వెంకటరమణ- సుగుణసుందరి దంపతులు రూ.1,01,116 విరాళం సమర్పించారు. దాతలకు స్వామివారి చిత్రపటం అందించారు.

శుభాలు అందించే నూకాంబికా అమ్మవారు

ఉగాది రోజున చింతలూరు అమ్మవారి దర్శనానికి క్యూకట్టిన భక్తులు

అలమూరు, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ఉగాది పర్వదినం కావడంతో చింతలూరు నూకాంబికా అమ్మవారిని దర్శించుకోవడం కోసం భక్తులు క్యూకట్టారు. భక్తులు అధికసంఖ్యలో తరలిరావడంతో చింతలూరు ఒక్కసారిగా కిక్కిరిసిపోయింది. గోదావరి జిల్లాలో పేరుగాంచిన జాతరగా గుర్తింపు పొందిన చింతలూరు నూకాంబికా అమ్మవారిని ఉగాది రోజున దర్శించుకుంటే శుభాలు కలుగుతాయనే నమ్మకంతో భక్తులు వస్తుంటారు. దీంతో భక్తులు రద్దీని దృష్టిలో పెట్టుకుని ఆలయ కార్యనిర్వహణాధికారి ఉండవల్లి వీర్రాజుచౌదరి, ఉత్సవ ప్రత్యేకాధికారి బాలాజీ రామ్‌ప్రసాద్, ఉత్సవ సేవాకమిటీల ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయవద్ద నూకాంబికా అమ్మవారికి బద్ది కడుగుట కార్యక్రమం శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం చింతలూరు వెంకటాచలం ఆధ్వర్యంలో పంచాంగ శ్రావణం నిర్వహించారు. చింతలూరు నూకాంబికా అమ్మవారిని ఉగాది పర్వదిన సందర్భంగా కొత్తపేట నియోజకవర్గానికి చెందిన వివిధ పార్టీల నాయకులు అమ్మవా రిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జనసేనపార్టీ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్, డీసీ ఎంఎస్ మాజీ చైర్మన్ కె.వీ.సత్యనారాయణరెడ్డితోపాటు పలువురు నాయకులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు. ఎమ్మెల్యే బండారుకు ఆలయ మర్యాదలతో డోలు సన్నాయితో వేదపండితుల మంత్రోచ్చరణలతో ఆలయ ఈవో ఉండవల్లి వీర్రాజు సేవా కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.


నూకాంబిక అమ్మవారి దర్శించుకుంటున్న ఎమ్మెల్యే బండారు.

సీఆర్సీ సేవలు అభినందనీయం




రావులపాలెం సీఆర్సీలో విడాకులు కావాలి నాటక ప్రదర్శన చేస్తున్న కళాకారులు. మేకప్ ఆర్టిస్ట్ అడవి శంకరరావును సత్కరిస్తున్న ఎమ్మెల్యే బండారు, సినీనటుడు తనికెళ్ల భరణి, జనసేన ఇన్‌చార్జ్ శ్రీనివాస్

● ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

● ఆకట్టుకున్న నాటిక ప్రదర్శనలు

రావులపాలెం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): అంతరించిపోతున్న నాటిక కళను ప్రోత్సహించేందుకు సీఆర్సీ అందిస్తున్న ప్రోత్సాహకం అభినందనీయమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం సీఆర్సీ నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో 25వ ఉగాది ఆహ్వాననాటికల పోటీ ఆదివారంరాత్రి ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జనసేనపార్టీ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్, సీఆర్సీకాటన్ కళాపరిషత్ గౌరవాధ్యక్షుడు తనికెళ్ళ భరణి ప్రారంభించారు. మొదటిరోజు ఆదివారం రాత్రి అరవింద ఆర్ట్స్ తాడేపల్లి వారి విడకాలు కావాలి నాటికను ప్రదర్శించారు. దర్శకత్వం గంగోత్రి సాయి, రచన వల్లూరి శివప్రసాద్ నిర్వహించారు.

అదే విధం గా రెండవ నాటికగా అమరావతి ఆర్ట్స్ గుం టూరు వారి చిగురుమేఘం ఈ నాటికకు దర్శకత్వం వేపూరి హరిబాబు, కావూరి సత్యనారాయణ వ్యవహరించారు. విడాకులు కావాలి నా టిక భార్య భర్తలు రిటైర్డ్ అయిన తరువాత మొగుడుపెళ్ళం గొడవపడి ఒకరినొకరు అర్థం చేసుకోకుండా విడాకులు కోసం కోర్టుకు వెళ్తారు. చివరకు వయ్యస్సు పెరిగి శరీర భాగాలు సహకరించక విడాకులు వద్దని కలిసిపోతారు. భార్యభర్తలు మధ్య గొడవలు వచ్చిన సర్దుకుపోవాలే తప్ప గొడవలు పెంచుకుని కోర్టుకు వెళ్ళకూడదనే సందేశంతో ఈ నాటిక ప్రదర్శన సాగింది. ఈ చిగురుమేఘం నాటిక కళాకారుల పోషించిన పాత్ర సన్నివేశాలు ప్రేక్షకులను కంటతడి పెట్టించాయి. అలాగే హైదరాబాద్‌కు చెందిన మేకప్ ఆర్టిస్ట్ అడవి శంకరరావుకు సీఆర్సీ కాటన్ కళాపురస్కారం ఎమ్మెల్యే బండారు సత్యానందరావు జనసేన పార్టీ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్, పరిషత్ గౌరవ అధ్యక్షుడు తనికెళ్ళ భరణితోపాటు పలువురు అందించి సత్కరించారు. కార్యక్రమంలో కళాకారులు గుండు సుదర్శన్, గౌతంరాజు, జోగినాయుడుతో పాటు పలువురు పాల్గొన్నారు.

ఎస్.పైడిపాలలో ఇరువర్గాల ఘర్షణ

● 11 మందిపై కేసు నమోదు

● 144 సెక్షన్ అమలు

రౌతులపూడి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): కాకినాడజిల్లా రౌతులపూడి మండలం ఎస్. పైడిపాల గ్రామంలో టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య శనివారంరాత్రి 11 గంటల సమ యంలో ఘర్షణ జరిగింది. టీడీపీ కార్యకర్త పుట్టిన రోజు, టీడీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రెండు కేక్‌లు తీసుకుని సెంటర్లో కట్ చేశారు. వైసీపీ కార్యకర్త బైక్‌పై వచ్చి వాటిని కాలితో తన్నాడు. దీంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చెలరేగింది. స్థానికుల సమాచారంతో ఎస్ఐ వెంకటేశ్వరరావు సంఘటనా స్థలికి చేరుకుని ఇరువర్గాల వారికి చెదరగొ ట్టారు. 11 మందిపై కేసు నమోదు చేశారు. ఎటువంటి గొడవలు జరుగకుండా గ్రామంలో సెక్షన్ 144 విధించారు.

క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే...

రంజాన్

● ఈ మాసంలోనే ఖురాన్ అవతరణ




ఢిల్లీకి చెందిన మతగురువు మౌలానాసయ్యద్‌తాజిమ్ అబ్బాస్‌రిజ్విసాహెబ్‌ఖిబ్లా

ముమ్మిడివరం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే రంజాన్ మాసం. ఈ మాసంలోనే పవిత్ర దైవగ్రంథం దివ్య ఖురాన్ ఆవిర్భవించింది. రంజాన్ పండుగకు మరోపేరు ఈద్ ఉల్ ఫితర్. ఈనెలలో ముస్లింలు భక్తి శ్రద్ధలతో ఉపవాసాలు ఫిత్ర జకాత్, దానధర్మాలు చేస్తుంటారు. పండుగలు మన జీవన స్రవంతిలో భాగమై మన జాతీయతకు సాంస్కృతిక వికాసానికి దోహదం చేస్తుంటాయి. పండుగ అనేది ఏ మతానికి సంబంధించినదైనా సరే దాని వెనుక ఒక సందేహం దాగి ఉంటుంది. పండుగ మానవాళికి హితాన్ని బోధిస్తుంది. ముస్లింలు అత్యంత పవిత్రంగా జరుపుకునే రంజాన్ పండుగ ఇదే హితాన్ని మానవాళికి అందిస్తుంది. ముస్లింలు చాంద్రమాన క్యాలెండర్‌ను అనుసరిస్తారు. చాంద్రమానాన్ని అనుసరించే ఇస్లామీయా క్యాలెండర్‌లో 9వనెల రంజాన్. దీన్ని ముస్లింలు పవిత్రమైనదిగా భావిస్తారు.

దాన ధర్మాలకు ప్రత్యేక స్థానం

ఆధ్యాత్మికంగా ఎంతో ప్రాముఖ్యత ఉన్న రంజాన్ మాసం ప్రత్యేక ప్రార్థనలు, కఠిన రోజా ఉపవాస దీక్షలు, దానధర్మాలు, ఆధ్యాత్మిక సందేశాలతో సాగుతుంది. మహ్మద్ ప్రవక్తలా ఇల్లాహ ఇల్లాల్ల అనే సూత్రం ప్రకారం మానవులను కష్టాల నుంచి కాపాడేందుకు ఈ మాసాన్ని సృష్టించినట్టు చరిత్ర చెబుతుంది. ఈ మాసంలో రోజుకు ఐదుసార్లు నమాజుతో పాటు ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. ఈ పవిత్ర మాసంలో దాన ధర్మాలకు కూడా ప్రత్యేక స్థానం ఉంది. ఈ నెలలో చనిపోతే నేరుగా స్వర్గానికి చేరుతారని, నరకపు ద్వారాలు మూసి ఉంటాయని ముస్లింల ప్రగాఢ నమ్మకం.

రంజాన్.. ఈదుర్ ఫితర్

ప్రతి మాసంలో శుక్రవారం రోజున ముస్లింలు నమాజు చేయడం ఆనవాయితీగా వస్తుంది. రంజాన్ మాసంలో మత పెద్దలతో నమాజు చేయించడం ప్రాశస్త్యమైనది. మసీదుకు వెళ్లలేనివారు తాము ఉన్న స్థలాన్ని శుభ్రం చేసుకుని ప్రార్థన చేసి భగవంతుడికి కృపకు పాత్రలవుతారు. ముస్లింలకు రంజాన్ ఆఖరి పది రోజులు ఇళ్లు వదిలి మసీదులో ఉంటూ మహ్మద్‌ప్రవక్త అల్లాహ్ గురించి ప్రదర్శనలతో ఆధ్యాత్మిక భవాన్ని పెంపొందించుకుంటారు. రంజాన్ పండుగను ఈదుర్ ఫితర్ అని అంటారు. నెలపొడుపు, చంద్రుని దర్శించిన తర్వాత రోజు ఉదయం పండుగను జరుపుకుంటారు.

పేదలకు దానం చేయాలి

● మొల్లా ముస్తఫా మసీదు ఇమామ్ మొహమ్మద్ రజా



అమలాపురం టౌన్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు విధిగా దానధర్మాలు చేసిన ప్పుడే అల్లా కరుణిస్తాడు. పవిత్ర ఖురాన్ గ్రంథాన్ని విధిగా పఠించాలి. పఠించలేని వారు వినాలి. ముస్లింలు తమ సంపాదనలో భాగంగా బంగారం, వెండి, ఇతర ఆదాయాల మీద జకాత్ తప్పనిసరిగా తీసి పేదలకు పంచాలి. కడుపు లో ఉన్న బిడ్డతో సహా ప్రతిఒక్కరూ రూ.80 ఫిత్రా కింద చెల్లించాలి. నెలవంకను చూసి రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభించి మళ్లీ నెలవంకను చూసి ఉపవాస దీక్షను విరమిస్తారు. రంజాన్ సందర్భంగా మసీదులో ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తాం. రాజస్థాన్, జైపూర్ నుంచి వచ్చిన మత గురువులు ప్రత్యేక ప్రార్థనలు జరుపుతారు.

కృష్ణకుమార్‌కు కళారత్న పురస్కారం


సీఎం చంద్రబాబు, మంత్రి కందుల దుర్గేష్ నుంచి కళారత్న పురస్కారాలు అందుకుంటున్న కృష్ణకుమార్, రాష్ట్ర ప్రత్యేక దళం కమాండెంట్ డాక్టర్ నరసింహారావు దంపతులు, కత్తిమండ ప్రతాప్

కార్పొరేషన్ (కాకినాడ), మార్చి 30 (ఆంధ్రజ్యోతి): కళారత్న (హంస) పురస్కారం అందుకుంటున్న కాకినాడకు చెందిన ప్రముఖ నాట్యాచార్యుడు కృష్ణకుమార్.

నరసింహారావు దంపతులకు..

పి.గన్నవరం: రాజమహేంద్రవరం జోన్ కమాండెంట్ డాక్టర్ కొండా నరసింహారావు, అలివేలు మంగాదేవి దంపతులకు కళారత్న (హంస) పురస్కారాన్ని సీఎం చంద్ర బాబునాయుడు అందించారు. వారికి పలువురు అధికారులు, నాయకులు అభినందనలు తెలిపారు.

డాక్టర్ ప్రతాప్‌కు..

అంతర్వేది: సీఎం చంద్రబాబునాయుడు చేతులమీదుగా సఖినేటిపల్లి మండలానికి చెందిన శ్రీశీకళావేదిక సీఈవో, ప్రముఖ కవి, రచయిత, సాహితీవేత్త డాక్టర్ కత్తిమండ ప్రతాప్ కళారత్న (హంస) పురస్కారాన్ని ఆదివారం అందుకున్నారు.

అనుమానం పెనుభూతమై.. భర్తే కాలయముడై..

● విద్యుత్ వైరుతో భార్యను హతమార్చిన భర్త

● యర్రయ్యపేటలో ఘటన


మృతురాలు పద్మ శవాన్ని పరిశీలిస్తున్న పెద్దాపురం ఎస్‌డీపీవో శ్రీహరిరాజు, తుని సీఐ చెన్నకేశవరావు


భర్త దారకొండ

తొండంగి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఉగాది పండుగ ప్రపంచానికి ఉషస్సులు అందిస్తే ఆ ఇంట భర్తే కాలయముడై కట్టుకున్న భార్య ఉసురుతీసి పిల్లల్ని అనాథలుగా మార్చాడు. ఊరంతా అమ్మవార్ల సంబరాల్లో మునిగి తేలుతుంటే వ్యసనాలకు బానిసైన భర్త భార్య ఉసురు తీసే పనిలో ఉన్నాడు. కాకినాడ జిల్లా తొండంగి మండలం యర్రయ్యపేట శివారు కొత్తపేటలో గోసల పద్మ అనే వివాహిత హత్యకు గురైంది. పెద్దాపురం ఎస్‌డీపీవో శ్రీహరిరాజు, తునిరూరల్ సీఐ చెన్నకేశవరావు, ఎస్ఐ జగన్మోహన్‌లు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. జరిగిన సంఘటనకు సంబంధించి పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. గోసలపద్మ (34), ధారకొండలు భార్యాభర్తలు. వీరిద్దరికీ కుమారుడు, కుమార్తె ఇరువురు సంతానం. భార్యాభర్తల మధ్య సఖ్యత లేకపోవడంతో తరచూ గొడవలు పడుతూ ఉండేవారు, వ్యసనాలకు, తాగుడుకు బానిసగా మారిన భర్త దారకొండ కుటుంబాన్ని పట్టించుకోకుండా తిరిగేవాడు. భార్య ప్రవర్తనను అనుమానించేవాడు. తరచూ ఈ విషయమై భార్యతో గొడవపడుతూ ఉండేవాడు. ఈనేపథ్యంలో శనివారంరాత్రి ఇంట్లో నిద్రిస్తున్న పద్మ మెడకు విద్యుత్ వైరింగ్‌కు ఉపయోగించే వైరు చుట్టి గట్టిగా బిగించడంతో ఊపిరాడక మరణించింది. వీరికి కుమార్తె లాశ్య(13), కుమారుడు సిద్ధు(14) ఉన్నారు. వీరిద్దరు ఎనిమిది, తొమ్మిది తరగతులు చదువుతున్నారు. మృతురాలికి ఏడుగురు అక్కాచెల్లెళ్లు ఉన్నారు. విషయం తెలిసిన వెంటనే మృతురాలి బంధువులు, అక్కాచెల్లెళ్ల రోధనలతో గ్రామమంతా నిండి పోయింది. ప్రశాంతంగా ఉండే గ్రామంలో జరిగిన సంఘటన ఉలిక్కిపడేలా చేసింది. మృతురాలి సోదరి చొక్కా అశ్విని ఇచ్చిన ఫిర్యాదు మేరకు తుని రూరల్ సీఐ చెన్నకేశవరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు దారకొండను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

త్వరలో రాష్ట్రంలో వైసీపీ ఖాళీ

● జగన్ పూర్తిగా లండన్‌కు పరిమితమై వైద్యం చేయించుకోవచ్చు ● మంత్రి వాసంశెట్టి సుభాష్

అనపర్తి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైసీపీ ఖాళీ కాబోతుందని, ఇప్పటికే అనేకమంది నాయకులు టీడీపీ, బీజేపీల్లో చేరారని, 151నుంచి 11 సీట్లకు పడిపోవడంతో వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డికి మతి భ్రమించిందని, అందుకే వైద్యంకోసం లండన్ వెళ్లి వస్తున్నారని, ఇక లండన్‌లో ఉండి పూర్తి వైద్యం చేయించుకోవచ్చని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఆదివారం తూర్పుగోదావరిజిల్లా అనపర్తిమండలం రామవరంలో ప్రభుత్వ హోమియో వైద్యశాలను అనపర్తి, మండపేట ఎమ్మెల్యేలు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, వేగుళ్ల జోగేశ్వరరావులతో కలిసి మంత్రి ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ ప్రతి పేదవాడికి వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఎమ్మెల్యే నల్లమిల్లి మాట్లాడుతూ హోమియో ఆసుపత్రి శిథిలావస్థకు చేరుకోవడంతో తాత్కాలికంగా సచివాలయంలో ఆసుపత్రిని ఏర్పాటు చేశామని, రూ.20లక్షలతో త్వరలోనే ఆసుపత్రికి నూతన భవన నిర్మాణం చేపడతామన్నారు. అనంతరం రామవరంలో టీడీపీ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మంత్రి సుభాష్ మాట్లాడారు. ఈసందర్భంగా గ్రామానికి చెందిన ఎంపీటీసీలు నల్లమిల్లి భాగ్యలక్ష్మి, గొలుగూరి గౌతమి, మాజీ ఎంపీటీసీ గోవిందరెడ్డి, మాజీ సర్పంచ్ గొలుగూరి భూలక్ష్మి, పలువురు పంచాయతీ వార్డు సభ్యులు సుమారు 50 మంది కార్యకర్తలు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. వీరికి మంత్రి సుభాష్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావులు పార్టీ కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. వైసీపీ నాయకుడు వైరా సూరిబాబు ఎమ్మెల్యే నల్లమిల్లి సమక్షంలో బీజేపీ కండువా కప్పుకున్నారు. మంత్రి సుభాష్, ఎమ్మెల్యేలు నల్లమిల్లి, వేగుళ్ళలను రామవరం నాయకులు సత్కరించారు.

మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూంకు దేశంలోనే ప్రముఖ స్థానం

● అమలాపురంలో షోరూంను ప్రారంభించిన మంత్రి సుభాష్


అమలాపురంలో మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూంను ప్రారంభిస్తున్న మంత్రి సుభాష్ చిత్రంలో ఎంపీ హరీష్‌మాధుర్

అమలాపురం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ దేశంలోనే ప్రముఖ స్థానాన్ని దక్కించుకుందని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. అమలాపురం పట్టణంలోని మెయిన్ రోడ్డులో కొల్లూరు గున్నయ్య భవనంలో నూతనంగా ఏర్పాటు చేసిన మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూంను మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రారంభించారు. షోరూంలోని వివిధ విభాగాలను అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు,మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు, ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్‌లు ప్రారంభించారు. మలబార్ గోల్డ్‌లో అత్యాధునిక మోడల్స్ నేటితరం వారినే కాకుండా అన్నివర్గాల వారిని ఆకట్టుకుంటాయని మంత్రి సుభాష్ పేర్కొన్నారు. మలబార్ గోల్డ్‌ను ఆదరించే ప్రత్యేక కస్టమర్లు ఉండడం విశేషమని ఎంపీ హరీష్, ఎమ్మెల్యే ఆనందరావులు పేర్కొన్నారు. భారతదేశంలోనే కాకుండా ప్రపంచంలోని 13 దేశాల్లో 380కు పైగా మలబార్ షోరూంలను నిర్వహిస్తున్నట్టు మేనేజ్‌మెంట్ టీమ్ సభ్యుడు సిరాజ్ పీకే తెలిపారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, గంధం పల్లంరాజు, కొల్లూరి చినబాబు, మున్సిపల్ చైర్మన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు, కోస్టల్ జోనల్ హెడ్ పెబిన్, బ్రాంచి హెడ్ అబిన్‌తోపాటు పలువురు రాజకీయ రంగ ప్రముఖులు పాల్గొన్నారు.

నాగాంజలి బ్రెయిన్ డ్యామేజ్ అయ్యింది

మెరుగైన వైద్యం కొనసాగిస్తున్నాం: బొల్లినేని కిమ్స్ వైద్యులు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): నాగాంజలి బ్రెయిన్ డ్యామేజి అయ్యింది, బీపీకి రెండు ఇంజక్షన్లు ఇస్తున్నాం దాని వల్లనే ప్రాణం నిలబడింది. నరాల పరంగా వృద్ధి లేదు. కోమాలోనే ఉందని కిమ్స్ బొల్లినేని వైద్యులు బృందం స్పష్టం చేసింది. ఆదివారం రాజమహేంద్రవరంలోని బొల్లినేని ఆసుపత్రిలో జరిగిన విలేకరుల సమావేశంలో వైద్యులు రామరాజు, శశాంకర్, దీపక్, ఆసుపత్రి ఈడీ రామ్మోహనరావు మాట్లాడారు. నాగాంజలి బ్రెయిన్ డ్యామేజి అయ్యింది, ఫిట్స్ వచ్చాయని, అవి తగ్గడానికి మందులు ఇచ్చామని పేర్కొన్నారు. 'బ్రెయిన్ డెడ్ కాలేదన్నారు. కలెక్టర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డాక్టర్లు కూడా వస్తున్నారు. వారి సలహాలు తీసుకుంటున్నాం. బ్రెయిన్ నరాలు మెరుగుపడటానికి చాలా సమయం పట్టొచ్చు, ఫిట్స్ రాకుండా ఉండడానికి మెడిసిన్ పెట్టా'మని చెప్పారు. బ్రెయిన్ డెడ్ కాలేదని తెలియజేస్తున్నామని, ఆసుపత్రి విషయంలో చనిపోయిన వారికి చికిత్స చేస్తున్నామని అవాస్తవ ప్రచారాలు చేయవద్దని మనవి చేస్తున్నామన్నారు. దీపక్ అనే వాడిపై ఆసుపత్రి పరంగా చర్యలు తీసుకున్నామని చెప్పారు. అనంతనం అంజలి హెల్త్ నివేదికను విడుదల చేశారు. ఆమె ఆరోగ్య పరిస్థితిపై వివరణ ఇచ్చారు.

మాకూ ఇంజక్షన్లు ఇవ్వండి

మేమూ చచ్చిపోతాం: అంజలి తల్లిదండ్రులు

మా పాప తీసుకున్న ఇంజక్షనే మాకూ ఇవ్వండి మేమూ చచ్చిపోతామని నాగాంజలి తల్లిదండ్రులు అన్నారు. తండ్రి దుర్గారావు విలేకరులతో మాట్లాడుతూ మా పాప లేచి తిరుగుతుందో లేదో తెలియ దంటున్నారన్నారు. తనను మోసం చేసిన వాడికి కఠిన శిక్షపడాలి. ఆసుపత్రి యాజమాన్యానికి తెలియకుండా ఉండదని అంటున్నారు. మా పాప స్థితికి కారణమైన దీపక్‌ను ఎన్‌కౌంటర్ చేయండి, ఇటువంటి సంఘనలు మరలా జరగకూడదని వారు కన్నీరు పెట్టుకున్నారు.

విశిష్ట ప్రతిభా సేవకులకు ఉగాది పురస్కారాలు



ఉగాది పురస్కారాలు అందుకున్న వివిధ రంగాల్లో నిష్ణాతులైన వ్యక్తులు

కడియం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): సంస్కృతి సాంప్రదాయాలు తెలుగువారి సొంతమని బాధ్యత సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు గిరజాల బాబు, తులసి దంపతులు అన్నారు. ఉగాది సందర్భంగా బాధ్యత సంస్థ ఆధ్వర్యంలో కడియం ఉన్నత పాఠశాల ఆవరణలో వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో నిష్ణాతులైన 12 మందికి 'గిరజాల కృష్ణారావు' పేరిట విశిష్ట ప్రతిభా పురస్కారాలు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో జేగురుపాడు సర్పంచ్ యాదల స్టాలిన్, గిరజాల నాగేశ్వరరావు, తిరుమలశెట్టి శ్రీను, వెలుగుబంటి అచ్యుతరామ్, తాడాల చక్రవర్తి, ఊటుకూరి శైలజ, సాపిరెడ్డి సూరిబాబు పాల్గొన్నారు.

మురమండలో ఎడ్ల పట్టు ప్రదర్శన పోటీలు



నందన్న రోడ్డులో పరుగుదీస్తున్న ఎడ్లజత

చక్రద్వారబంధం ఎడ్ల జతకు ప్రథమ స్థానం

కడియం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ఉగాది సందర్భంగా మురమండలోని దుళ్ల రోడ్డులో నందీశ్వరస్వామి ఆలయం వద్ద ఎడ్ల పట్టు ప్రదర్శన పోటీలు ఉత్సాహంగా, ఉత్కంఠ భరితంగా జరిగాయి. పోటీలను టీడీపీ రాష్ట్ర వైద్యవిభాగం ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవిరామ్‌కిరణ్ గోరంట్ల తిలకించారు. 150 కిలోల బరువుతో, 110 గజాల దూరం పట్టు ప్రదర్శన పోటీలు నిర్వహించారు. రాజానగరం మండలం చక్రద్వారబంధంకు చెందిన ముంగర నాగేశ్వరరావు ఎడ్లు ప్రథమ, ఆలమూరు మండలం మూలస్థానం గ్రామానికి చెందిన మురమళ్ల రాంబాబు ఎడ్లు ద్వితీయ, కడియం మండలం మురమండ గ్రామానికి చెందిన మిద్దే సురేష్ ఎడ్లు తృతీయ స్థానాల్లో నిలిచాయి. విజేతలకు నగదు బహుమతి, జ్ఞాపికలు అందజేశారు. అలానే పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. మొగలపు వెంకట రామకృష్ణారావు, ఐ.వెంకటేశ్వరరావు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

సుఖశాంతులతో వర్ధిల్లాలి

- ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్
- ఘనంగా ఉగాది వేడుకలు
- ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు



రెడ్డి కన్వెన్షన్ హాల్లో జరిగిన ఉగాది వేడుకలకు విచ్చేసిన ప్రముఖులు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ప్రజలంతా సుఖశాంతులతో జీవించాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం రాజమహేంద్రవరం తిలక్‌రోడ్డులోని రెడ్డి కన్వెన్షన్ హాలులో ఆయన ఏర్పాటు చేసిన ఉగాది పంచాగశ్రవణం కార్యక్రమంలో తొలుత ఎమ్మెల్యే వాసు మాట్లాడారు. మన సంస్కృతిక సాంప్రదాయాలను ప్రతిబింబించే ఉగాది పచ్చడిలో ఆరు రుచులు మన జీవితంలోని కష్ట సుఖాలకు ,నష్టాలకు ప్రతీకలన్నారు. అన్నింటిని సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగడమే జీవిత మన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ ఒక్కొక్కటిగా నెరవేరుస్తుందన్నారు. ప్రజల మధ్య ఆర్థిక అసమానతలను తొలగించేందుకు పీ4 కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. తొలుత వాసు వేదపండితుల ఆశీర్వాచనాలను పొందారు. అనంతరం తండ్రి మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, తల్లి వీరరాఘవమ్మ ఆశీస్సులు అందుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం కల్చరల్: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ప్రారంభించి 100 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సంఘ్ ప్రారంభకులు కేశవ రావు బలిరాం హెడ్గేవార్ జన్మదినం సందర్భంగా ఆదివారం క్వారీ సెంటర్ శివాలయం వద్ద ఉగాది ఉత్సవం జిల్లా సంఘ సంచాలక్ డాక్టర్ కర్రి రామారెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. సంఘ్ సేవక్ సభ్యులు రాజమండ్రి పురవీధుల్లో కవాతు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వెంకటేశ్వర ఫైనాన్స్ అధినేత రావిపాటి మదన గోపాలస్వామి విచ్చేశారు. ఏపీ సహ ప్రాంత ప్రచారక్ శ్రీ జనార్దన్ ప్రధాన వక్తగా పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ఉగాది సందర్భంగా మాజీ ఎంపీ, వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్‌రామ్ స్థానిక కొత్తపేటలోని శ్యామలాంబ అమ్మవారిని దర్శించుకున్నారు.

ధవళేశ్వరం: ధవళేశ్వరం గ్రామ దేవత శ్రీము త్యాలమ్మ ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకుని పోతురాజుకు పానకం, వడపప్పు చలివిడి సమర్పించారు. భక్తులకు ఈ సందర్భంగా జనసేన నాయకుడు యడ్ల మహేష్ ఆధ్వర్యంలో ముత్యాలమ్మ అమ్మ వారి ఫొటో, జనసేన పేరు ఉన్న గాజుగ్లాసులో ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. కార్యక్రమంలో దిండి జగదీష్, కొప్పిశెట్టి గాంధీ, ఎస్.సత్తిబాబు, నరుకుల రాజు, వాసు, నాగరాజు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయాలను సర్వాంగ సుందరంగా పూలతో అలంకరించారు. వేద పండితులతో పంచాంగ శ్రవణం గావించారు. తొర్రేడు గ్రామంలోని ఒనువులమ్మ ఆలయంలో ఉగాది వేడుకలు నిర్వహించారు. గరగలు, మేళతాళాలతో భక్తులు తలపై గరగలను పెట్టుకొని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు సూర్యకుమార్ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. అనంతరం పంచాంగ శ్రవణం, లలితా సహస్ర పారాయణం చేశారు.

చిలుకూరికి ఉగాది పురస్కారాలు..

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం సెంట్రల్‌జైలులో టీచర్‌గా పనిచేస్తున్న కవి చిలుకూరి శ్రీనివాసరావు ఉగాది పురస్కారం అందుకున్నారు. ఆదివారం రాజమహేంద్రవరంలోని ఎస్‌వీ ఫంక్షన్ హాలులో జరిగిన ఉగాది వేడుకల్లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి చేతులమీదుగా పురస్కారం, సత్కారం పొందారు. అలాగే జిల్లాస్థాయిలో అధికారిక ఉగాది వేడుకల్లో భాగంగా ఆనం కళాకేంద్రంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ ప్రశాంతి చేతులమీదుగా పురస్కారం అందుకున్నారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మద్దిపాటి వెంకటరాజు, బత్తుల బలరామకృష్ణ, డీఈవో వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

పంచాంగ శ్రవణం

కడియం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): కడియపులంక హరిహర మహాక్షేత్రం అపర్ణ సమేత అనంతేశ్వరస్వామి ఆలయంలో ఉగాది సందర్భంగా పంచాంగ శ్రవణం జరిగింది. ఆలయ చైర్మన్ మార్గాని సత్యనారాయణకు అర్చకుడు దేవరబట్ల శ్రీనివాస్‌శర్మ వేద ఆశీర్వచనం అందించారు. అనంతరం రాశి ఫలాలు చదివి వినిపించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం నూతన పంచాంగ ప్రతులు అందజేశారు.

ఆర్థిక ఇబ్బందులతో

డ్రైవర్ ఆత్మహత్య

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 30(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రూరల్ మండలం బొమ్మూరు గ్రామం మురళీకొండ ప్రాంతానికి చెందిన మట్టుపల్లి విజయప్రకాష్(35) ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం వివరాల్లోకి వెళితే.. బొమ్మూరుకు చెందిన విజయప్రకాష్ గుజరాత్ ఓఎన్‌జీసీ కాంట్రాక్టర్ల వద్ద డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గుజరాత్‌లో పని ముగించుకుని ఈనెల 29న తిరిగి ఇంటికి చేరుకున్నాడు. రాత్రి భోజనం చేసి పడుకున్నాడు. ఆదివారం లేచి చూస్తే ఇంట్లో కనిపించలేదు. ఇంటి వెనుక ప్రాంతంలో చెట్టుకు ఉరివేసుకుని వేలాడు నిర్జీవంగా కనిపించాడు. కాగా ప్రకాష్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమౌతున్నాడని ఈ నేపథ్యంలో ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చనే అనుమానం వ్యక్తమౌతుంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని వాచ్‌మెన్ మృతి

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 30(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం సమీపంలో దివాన్‌చెరువు-శ్రీరాంపురం రోడ్డు దాటుతున్న వాచ్‌మెన్ సుంకర సత్యనారాయణ బాబులు(65)ను కారు ఢీకొట్టడంతో మృతి చెందినట్టు బొమ్మూరు పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. దివాన్‌చెరువు చెందిన సుంకర సత్యనారాయణ బాబులు శ్రీరాంపురం సమీపంలోని అపార్టుమెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. అతడి భార్య గతంలోనే మరణించింది. పిల్లలు లేరు. దీంతో వాచ్‌మెన్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రోడ్డు దాటుతుండుగా ఒక కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ సంఘటనలో తలకు తీవ్రగాయమైయింది. స్థానికులు అతన్ని రాజమండ్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించి అతడు మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జిత్ మోహన్ మిత్ర జన్మదినోత్సవం

రాజమహేంద్రవరం కల్చరల్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): నట గాయకుడు జిత్‌మోహన్‌మిత్ర 89వ జన్మదినం, ఆర్కెస్ట్రా 55వ వార్షికోత్సవం స్థానిక ఆనం రోటరీ హాల్‌నందు జరిగింది. విశిష్ట అతిథులుగా మాజీ ఎంపీలు ఉండవల్లి అరుణ్‌కుమార్, హర్షకుమార్, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు విచ్చేసి జిత్‌మోహన్‌మిత్రకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమానికి ముద్రగడ ఏసుబాబు జ్యోతి ప్రజ్వలన చేయగా నూజిళ్ల సూరిబాబు వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

నిందితులపై చర్యలు తీసుకోవాలి

- పాస్టర్ ప్రవీణ్ మృతికి సంతాపం
- కడియంలో భారీగా శాంతి ర్యాలీ
- ఎస్‌ఐ దుర్గాప్రసాద్‌కు వినతి



ఎస్‌ఐ దుర్గాప్రసాద్‌కు వినతిపత్రం అందజేసిన క్రైస్తవ సంఘాల నాయకులు

కడియం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై సమగ్ర విచారణ జరిపి నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పలువురు పాస్టర్లు అన్నారు. ఇటీవల మృతి చెందిన ప్రవీణ్ పగడాల మృతికి సంతాపంగా ఆదివారం కడియం మండల పాస్టర్స్ ఫెలోషిప్, క్రైస్తవ సంఘాల నాయకులు, ఆలిండియా క్రిస్టియన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. స్థానిక బీఆర్ అంబేడ్కర్ సెంటర్ నుంచి పోలీస్‌స్టేషన్ వరకు జరిగిన ఈ ర్యాలీలో వేలాది మంది క్రైస్తవులు పాల్గొన్నారు. వీరికి ముస్లిం నాయకులు, వివిధ సంఘాల నాయకులు సంఘీబావం తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ క్రైస్తవులపై జరుగుతున్న దాడులను అరికట్టి వారి హక్కులకు, మందిరాలకు, ఆస్తులకు, ప్రబోధకులకు రక్షణ కల్పించాలన్నారు. ఎస్‌ఐ దుర్గాప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జేగురుపాడు సర్పంచ్ యాదల స్టాలిన్, జిల్లా పెలోషిప్ వైస్ ప్రెసిడెంట్ ఎం.కరుణాకర్, రూరల్ రీజనల్ చైర్మన్ డి.పరంజ్యోతి, ఏఐసీసీ రీజనల్ చైర్మన్ కె.జయశీల్, ఏఐసీసీ మండల ప్రెసిడెంట్ సాలోమన్, కడియం ప్రెసిడెంట్ మోడీ, పాస్టర్ల పెలోషిప్ సంఘ నాయకులు జీవరత్నం, పి.శామ్యూల్‌రాజు, సీహెచ్ రత్నదీప్, రత్నరాజు, కె.ఎలీషా, బిషప్, రెయిన్‌హార్డ్, కె.మోహన్, కె.పౌలు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం రూరల్: పాస్టర్ ప్రవీణ్ పగడాల ఆకస్మిక మృతికి చింతిస్తూ మండలంలోని రాజవోలులో క్రీస్తు కృపా చర్చి పాస్టర్ పి.టాటావిక్టర్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ చేశారు. ప్రవీణ్‌కు నివాళులర్పించారు. క్రైస్తవుల భద్రత, ప్రవీణ్ కుటుంబానికి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

విశ్వావసు ఉగాది వేడుకలు

- ● ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- ● ఉగాది పచ్చడి పంపిణీ

బిక్కవోలు, మార్చి 30(ఆంధ్రజ్యోతి): విశ్వావసు నామ సంవత్సరానికి అధిపతి సూర్యభగవానుడని, ఈఏడాది అందరికీ శుభాలే జరుగుతాయని పండితులు కొడమంచిలి సత్యనారాయణశర్మ వివరించారు. బిక్కవోలు లక్ష్మీగణపతి ఆలయంలో దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వహించిన పంచాంగ శ్రవణంలో అందరికీ శుభాలతో పాటు, ఆదాయం, మంచి ఫలితాలు లభిస్తాయని, వ్యాపారులకు లాభాలు, కుటుంబాల్లో సంతోషం ఉంటుదని సత్యనారాయణశర్మ తెలిపారు. అనంతరం గ్రామంలోని పండితులకు సొంఠి శ్రీరామ్, శారదాపూర్ణల సహకారంతో పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పల్లి శ్రీనివాసరెడ్డి, పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, గొర్రెల త్రిమూర్తులు, పల్లి రాజారెడ్డి, బేరా గోవిందు, ఆలయ ఈఓ ఆకెళ్ల భాస్కర్, దేవదాయశాఖ సిబ్బంది ప్రసాద్, ఈశ్వర్, సత్తిబాబు పాల్గొన్నారు.

కోరుకొండ, (ఆంధ్రజ్యోతి): ఉగాది సందర్భంగా చారిత్రాత్మక కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో ఆదివారం స్వామి వారి ఆలయ ముఖ మండపంలో ఆలయ అర్చకస్వాములు స్వామి వారికి ఉగాది ఆస్థానం నిర్వహించారు. తొలుత స్వామివారికి వైకానస ఆగమ శాస్త్రం ప్రకారం పంచామృత అభిషేకాలు ఆలయ అనువంశిక ధర్మకర్త పరాసర రంగరాజ భట్టర్ స్వీయ పర్యవేక్షణలో పెద్దింటి, పెరవళి, పెదపాటి అనువంశిక అర్చకస్వాములు లక్ష్మీనరసింహస్వామి వారికి వేదోక్తంగా ఉగాది ఆస్థానం నిర్వహించారు. అనంతరంస్వామి వారికి గ్రామ పురోహితులు కలిపివాయి నమఃశివాయ శర్మ స్వామి వారిసమక్షంలో పంచాంగ శ్రవణం చేశారు. స్వామి,అమ్మవార్లకు ఆదాయ, వ్యవసాయ, రాజపూజిత, అవమానాలు, గ్రహచార, గోచార స్థితిగతులు వివరించారు. శ్రీవిశ్వావసునామ సంవత్సరం ఫలితాలు, పంటలు, వర్షాలు, దేశ కాలమాన పరిస్థితులు ఆరుద్ర కార్తీ ప్రవేశం, సరస్వతి నదికి పుష్కరాలు, చంద్రగ్రహణాలు, 27నక్షత్రాలు 12రాశుల ఫలితాలు వివరించారు. అన్నవరం దేవస్థానం అధికారులు, గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు. నర్సాపురంలోని రామాలయం వద్ద గ్రామపురోహితులు మర్ల ప్రభాకర స్వామయాజులుపంచాం గ శ్రవణం చేశారు. గ్రామస్తులందరికీ విశ్వావసు నామ ఫలితాలు వివరించారు. జంబుపట్నంలో మర్ల వెంకట గంగాధర సీతారామశాస్త్రి పంచాంగ శ్రవణం చేశారు. గాదరాడ, కణుపూరు, బూరుగుపూడి, దోసకాయలపల్లి కోటికేశవరం గ్రామాల్లో పంచాంగ శ్రవణం చేశారు.

ఓం శివశక్తి పీఠంలో ఉగాది వేడుకలు

గాదరాడలో ఓం శివశక్తిపీఠంలో ఆదివారం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ దంపతులు



కోరుకొండ: ఓం శివశక్తి పీఠం ఉగాది వేడుకల్లో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ దంపతులు

54దేవాలయాల్లో 108మంది దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. ఈసందర్భంగా ఓం శివశక్తి పీఠంలో ఉగాది వేడుకలు నిర్వహించారు. ఆలయ అర్చకస్వాములకు వేదపండితులకు, ఉగాది పురస్కారాలు అందజేశారు. ఎమ్మెల్యే దంపతులకు అర్చకస్వాములు వేదఆశీర్వచనంచేశారు. అర్చకస్వాములకు నూతన వస్త్రాలు అందజేశారు.

దివాన్‌చెరువు, (ఆంధ్రజ్యోతి): శ్రీవిశ్వావసు నామ సంవత్సరానికి స్వాగతం పలుకుతూ గ్రామగ్రామాన ఉగాది వేడుకలను ఆదివారం సంప్రదాయబద్ధంగా ఘనంగా జరుపుకున్నారు. ప్రజలు నూతన వస్త్రాలను ధరించి షడ్రుచుల సమ్మేళనమైన ఉగాది పచ్చడిని తయారు చేశారు. అనంతరం ఆ పచ్చడిని దేవుడికి నైవేద్యంగా సమర్పించారు. దివాన్‌చెరువులోని రాజుగారిసిటీలో గల శ్రీభూగోదా ఆండాళ్ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉగాది సందర్భంగా స్వామి, అమ్మవార్లకు విశేషారాధనలు జరిగాయి. సాయంత్రం వేంకటేశ్వరస్వామి ఆలయం, స్థానిక శ్రీలక్ష్మీగణపతి ఆలయం వద్ద జరిగిన పంచాంగ శ్రవణంలో స్థానికులు పాల్గొని రాశిఫలాలను ఆసక్తిగా తెలుసుకున్నారు.

రంగంపేట, (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషా సంస్కృతీ, సంప్రదాయాలు ప్రజల్లోకి తీసుకువెళ్ళడంలో కవులు కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మండవిల్లి గుప్తా పిలుపునిచ్చారు. ఆదివారం రంగంపేట శ్రీ కోదండ రామాలయంలో ఆలయ కమిటీ చైర్మన్ గారపాటి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన విశ్వావసు ఉగాది వేడుకల్లో ఆయన మాట్లాడారు. విశ్వావసునామ ఉగాది ప్రజలందరికీ శుభాలు చేకూర్చాలని, పాడి పంటలతో, ఆయురారోగ్యంగా వర్ధిల్లాలని సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా ప్రచారక్ శింగన సత్తిబాబు సూచించారు. ఈసందర్భంగా వసంత కాలం సంవత్సరాది శుభాకాంక్షలు, సామాజిక అంశాలు, ప్రభుత్వ పాలన విధానాలపై కవులు చన్న వెంకటేశ్వరరావు, చొల్లంగి సత్యనారాయణ, తెలుగు పండిట్ స్వాతి కుమారి, లోలభట్టు శ్రీనివాసరాజులు కవిత గానాన్ని వినిపించారు. తొలుత గ్రామ పురోహితుడు కోడూరి వెంకటరత్నం పంతులు పంచాగం పఠనం చేశారు. వెంకరత్నంను, కవులను ఎల్ఐసీ ఏజెంట్ మండవిల్లి గుప్తా ఘనంగా సత్కరించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు కంటిపూడి ఆనందరావు, వెంకట్రావు, దేవిన బుజ్జి, కొనుజుల సత్యనారాయణ, సూర్యనారాయణ పాల్గొన్నారు.



బిక్కవోలు లక్ష్మీగణపతి ఆలయంలో పండితుల పంచాంగ శ్రవణం

రాజానగరం, (ఆంధ్రజ్యోతి): విశ్వావసు నామ ఉగాది వేడుకలను ఆదివారం గ్రామ గ్రామాన భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. వేకువ జామున స్నాన మాచరించి కొత్త దుస్తులు ధరించారు. షడ్రుచుల మిశితమైన వేప పువ్వు పచ్చడిని స్వీకరించారు. అనంతరం ఆలయ దర్శనం చేసుకున్నారు. ఆయా ఆలయాల్లో చేపట్టిన పంచాంగ శ్రవణం చేశారు. విశ్వావసు నామ సంవత్సరంలో ఆదా య, వ్యయాలు, రాజపూజ్యం, అవమానాలు, పాడి పంటలు గురించి పురోహితులు వివరించారు.

గోకవరం, (ఆంధ్రజ్యోతి): విశ్వావసు ఉగాది వేడుకలు గోకవరం మండలంలో ఆదివారం జరిగాయి. ప్రతీ గ్రామంలో ప్రజలు తెల్లవారు జాము నుంచి ఆలయాలను సందర్శించి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం షడ్రుచుల కలయి కతో తయారుచేసిన ఉగాది పచ్చడిని అందరికీ పంచారు. పంచాంగ శ్రవణం పఠించారు. యువకులు, యువతులు, విద్యార్థులు సంప్రదాయ దుస్తులతో అలరించారు.

సీతానగరం, (ఆంధ్రజ్యోతి): శ్రీవిశ్వావసు నామ సంవత్సర వేడుకలను మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం ఉగాది సందర్భంగా ఆలయాలు కిటకిటలాడాయి. అధిక సంఖ్యలో భక్తులు ఆలయాలను సందర్శించి పూజలు చేయించుకున్నారు. ఆలయాల్లో పురోహితులతో పంచాంగ శ్రవణ నిర్వహించారు.

చాలీచాలని జీతాలతో తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ ఉద్యోగులు

గోకవరం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): చాలీచాలని జీతాలతో తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఉద్యోగులు తీవ్రఇబ్బందులు పడుతున్నారని తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సంఘం తూర్పుగోదావరి జిల్లా ట్రెజరర్ పి.రవి ఆవేదన వ్యక్తం చేశారు. గోకవరంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈనెల31తో తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్(102) టెండర్ ముగియనుందని, నేషనల్ హెల్త్ మిషన్ ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలను గమ్యస్థానా లకు భద్రతతో చేరుస్తున్నామన్నారు. తొమ్మిదేళ్లుగా కెప్టెన్లకు(డ్రైవర్లు) కేవలం రూ.7,870 వేతనం మాత్రమే అందుతుందన్నారు. ఈఅరకొర జీతాలతో కుటుంబ పోషణ భారంగా మారిందని,

సోషల్‌మీడియాలో అభ్యంతరకర పోస్టుపై ఫిర్యాదు

సీతానగరం,మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టులపై సీతానగరం వీఆర్వో అఖిల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ వి.శ్రీను తెలిపారు. పాస్టర్ పగడాల ప్రవీణ్‌కుమార్‌పై సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టులు పెట్టారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఆయన తెలిపారు.

కళాకారుడు, అర్చకులకు ఉగాది పురస్కారాలు



కళాకారుడు సత్తిరాజుకు పురస్కారం అందిస్తున్న ఎంపీ పురందేశ్వరి



అర్చకుడు సుబ్రహ్మణ్యశర్మకు ఉగాది పురస్కారం అందజేస్తున్న కలెక్టర్

బిక్కవోలు, మార్చి 30(ఆంధ్రజ్యోతి): బిక్కవోలుకు చెందిన కళాకారుడు, అర్చకులకు ఆదివారం రాజమహేంద్రవరంలో జరిగిన కార్యక్రమాల్లో ఉగాది పురస్కారాలు లభించాయి. కొంకుదురు గ్రామానికి చెందిన కళాకారుడు అడపా సత్తిరాజు ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరి నుంచి, బిక్కవోలు గోలింగేశ్వరస్వామి ప్రధాన అర్చకులు సన్నిధిరాజు సుబ్రహ్మణ్యశర్మ కలెక్టర్ పి.ప్రశాంతి నుంచి ఉగాది పురస్కారాలు అందుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, బత్తుల బలరామకృష్ణ, మద్దిపాటి వెంకటరాజు, బీజేపీ జిల్లా అధ్యక్షులు పిక్కి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రమేష్‌బాబుకు పురస్కారం



సీతానగరం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): రఘుదేవపురానికి చెందిన డా.సత్యం రమేష్‌బాబు అందించిన వైద్య సేవలకు రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుపాటి పురందరేశ్వరి నుంచి ఆదివారం రాజమహేంద్రవరం ఎస్‌వీ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఉగాది వేడుకల్లో పురస్కారాన్ని అందుకున్నారు.

శ్రీమావుళ్లమ్మకు 108 పిండి వంటలతో సారె



మావుళ్లమ్మ ఆలయం వద్దకు కలశాలతో ఊరేగింపుగా వెళుతున్న మహిళలు

సీతానగరం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): సీతానగరం గ్రామదేవత శ్రీమావుళ్లమ్మ తల్లి అమ్మవారికి గ్రామస్తులు 108 రకాల పిండి వంటలతో సారెను అందించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం ఉగాది సందర్భంగా శ్రీమవుళ్ళమ్మ తల్లికి స్థానిక మహిళలు 900 మంది 108 రకాల వంటలను 900బిందెలతో సారెను సమర్పించారు. అధిక సంఖ్యలో మహిళలు ప్రధాన వీధుల్లో ఊరేగింపుగా బిందెలు (కలశాలు) ధరించి అమ్మవారి ఆలయం నుంచి లంకూరు నాలుగుబొమ్మల సెంటర్ మీదుగా పాత పోలీస్ స్టేషన్ వెలమపేట, పోలీస్ స్టేషన్ నుంచి అమ్మవారి ఆలయం చేరుకుని అమ్మవారికి సారెను అం దించారు. అధిక సంఖ్యలో మహిళలు బిందెలతో పుర వీధుల్లో గరగ నృత్యాలు, డప్పు వాయిద్యాలతో ఊరేగింపు నిర్వహించడం స్థానిక ప్రజలకు కనువిందు చేసింది. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ, ప్రసాదాలు అందించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు.

సుబ్బారెడ్డికి ఉగాది పురస్కారం



అనపర్తి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): విశిష్ట సేవలు అందించినందుకు రాష్ట్ర ప్రభుత్వం అందించే పురస్కారాన్ని అనపర్తికి చెందిన శ్రీరామకృష్ణ సేవాసమితి ప్రధాన కార్యదర్శి నల్లమిల్లి సుబ్బారెడ్డి ఆదివారం విజయవాడలో జరిగిన ఉగాది వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నుంచి అందుకున్నారు.

విరించికి ఉగాది పురస్కారం




రంగంపేట, మార్చి 30(ఆంధ్రజ్యోతి): శతావధాని, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త కడిమిళ్ళ శ్రీవిరించికి ఉగాది పురస్కారం లభించింది. కడిమిళ్ళ శ్రీవిరించి అందిస్తున్న తెలుగు సాహితి సేవలను గుర్తించి రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరీ నుంచి పురస్కారం అందుకున్నా డు. 20ఏళ్లుగా కవిగా, అవధానిగా, ఆధ్యాత్మిక వేత్తగా, తెలుగు వాకిలి సాహిత్య సేవా సంస్థను స్థాపించి రచనలు చేస్తూ సాహితి లోకంలో ప్రత్యేక స్థానాన్ని సుస్థిరపరచుకున్నారు.

ప్రవీణ్ పగడాల మృతిపై క్రైస్తవుల సంతాపం

రంగంపేట, మార్చి 30(ఆంధ్రజ్యోతి): రంగంపేట ఎలీమ్ లూథరన్ దేవాలయం ఆవరణలో ఆదివారం పాస్టర్ కె.ఆర్.ఆనంద్ విక్టర్ ఆధ్వర్యంలో ఇటీవల రాజమహేంద్రవరం మండలం కొంతమూరు సమీపంలో అకాల మరణం చెందిన అంతర్జాతీయ క్రైస్తవ ప్రసంగీకుడు పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతికి సంతాపం తెలియజేస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించి, శ్రద్ధాంజలి ఘటించారు. చింతపల్లి వినయ్‌కుమార్, రాయి చార్లెస్, దూబాసి వరప్రసాద్, కరుపోతు మంగరాజు, గుండుబిల్లి దైవప్రసాద్, గుడాల రత్నం, సంఘ సభ్యులు, స్త్రీల సమాజం, యూత్ సభ్యులు, సండే స్కూల్ విద్యార్థులు, క్రైస్తవులు పాల్గొన్నారు.

సబ్‌రిజిస్ట్రారు కార్యాలయం వెలవెల

సీతానగరం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాలతో ఉగాది రోజున ఆదివారం సీతానగరం సబ్‌రిజిస్ట్రారు కార్యాలయం పనిచేసింది. అయితే ఒక్కరూ కూడా భూములకు సంబంధించి రిజిస్ట్రేషన్ చేయించుకోలేదు. దీంతో క్రయ, విక్రయదారులు లేక కార్యాలయం వెలవెలబోయింది. 31వ తేదీ సోమవారం రంజాన్ రోజున కూడా కార్యాలయం పనిచేస్తుందని సబ్ రిజిస్ట్రారు ప్రసాద్ తెలిపారు.



ఉగాది.. సందడి

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): షడ్రుచుల సమ్మేళనం మన జీవిత గమనానికి నిదర్శనమని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు.జిల్లా సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం శ్రీవెంకటేశ్వ ర ఆనంకళా కేంద్రంలో ఆదివారం జరిగిన శ్రీవిశ్వావసు నామ సంవత్సర ఉగాది ఉత్సవాన్ని ప్రారంభించి మాట్లాడారు.రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించుకుంటున్నామని చెప్పారు. ఉగాది తెలుగు వారి పండుగ అన్నారు. ఈ ఉగాది -మన సంకల్పం అనే కవితను కలెక్టర్ చదివి వినిపించారు.ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ తెలుగు వారి పండుగను అధికారికంగా నిర్వహించిన సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. ప్రతిరోజు పంచాగ శ్రవణం చేస్తే గంగానదిలో స్నానం చేసినంత పుణ్యం దక్కుతుందన్నారు.అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ కూట మి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే ఉగాది వేడుకలు ఇంత ఘనంగా నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ ఇటువంటి పండుగలు ప్రభుత్వం నిర్వహించడం ద్వారా భవిష్యత్తరాలకు మన సంస్కృతి సాంప్రదాయాలను వారసత్వంగా అందించడం సాధ్యమవుతుందన్నారు.తొలుత శుభమంగళ నాదస్వరం కె.వెంకటేశ్వర్లు అందించారు.సిద్ధాంతి ఏవీఎన్‌డీ శ్రీనివాసులు పంచాగ శ్రవణం చేశారు.శ్రీవిజయశంకర ప్ర భుత్వ సంగీత కళాశాల బృందం వారిచే సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. వేడుకల్లో జేసీ ఎస్.చిన్నరాముడు,డీఆర్‌వో టి.సీతారామ్మూర్తి,ఆర్‌డీవోలు ఆర్.కృష్ణనాయక్,రాణి సు స్మిత,ఇన్‌చార్జి జిల్లా దేవాదాయ అధికారి తోట సుబ్రహ్మణ్యం,కేఆర్ఆర్‌సీ ఎస్‌డీసీఎస్ భాస్కరరెడ్డి,సీపీవో ఎల్.అ ప్పలకొండ,వ్యవసాయాధి కారి మాధవరావు తదితరులు పాల్గొన్నారు.





ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసును దీవిస్తున్న తండ్రి అప్పారావు

ఉగాది ఉత్సవంలో కలెక్టర్ ప్రశాంతిని సత్కరిస్తున్న సన్మానగ్రహీతలు చిత్రంలో ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి , ఎమ్మెల్సీ సోము, జేసీ చిన్నరాముడు, ఆర్‌డీవో కృష్ణనాయక్ తదితరులు



ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి దంపతులకు సత్కారం



జ్యోతి ప్రజ్వలన చేసి ఉగాది ఉత్సవాలను ప్రారంభిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి



బిక్కవోలు లక్ష్మీగణపతికి భక్తజనం పూజలు



ప్రత్యేక అలంకరణలో కోటసత్తెమ్మ

ఎంపీ పురందేశ్వరి ఆధ్వర్యంలో ఉగాది ఉత్సవం

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : శ్రీ విశ్వావసునామ సంవత్సరంలో అందరికీ మంచి జరగాలి. అందరూ ఆనందంగా ఉండాలి అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. రాజమహేంద్రవరం జేఎన్ రోడ్డులోని ఒక ప్రైవేట్ ఫంక్షన్‌హాలులో ఆదివారం ఎంపీ పురందేశ్వరి ఆధ్వర్యంలో ఉగాది ఉత్సవం నిర్వహించారు.వివిధ రంగాలకు చెందిన 60 మంది ప్రముఖులకు ఉగాది పురస్కారాలు అందజేసి సత్కరించారు. విశ్వావసు అంటే సంపదలన్నీ ఇచ్చే విష్ణుమూర్తి అని అన్నారు. జ్యోతిష ప్రవీణ పుల్లెల సత్యనారాయణ పంచాంగ శ్రవణం చేశారు. ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, బత్తుల బలరామకృష్ణ, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మద్దిపాటి వెంకట్రాజు, బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యుడు సోము వీర్రాజు, అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఎన్‌బీఎం మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు కలెక్టర్ రంజాన్ శుభాకాంక్షలు



రాజమహేంద్రవరం సిటీ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఉన్న ముస్లిం సోదరులకు కలెక్టర్ ప్రశాంతి ఆదివారం రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రంజాన్ పండుగను ముస్లిం సోదరులంతా వారి వారి కుటుంబాలతో సంతోషంగా నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు.

నేడు పీజీఆర్ఎస్ రద్దు

రంజాన్ ప్రభుత్వ సెలవు కావడం వల్ల ఈ నెల 31 సోమవారం జరగాల్సిన పీజీఆర్ఎస్ రద్దు చేశామని పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోనే కాకుండా ఎక్కడా పీజీఆర్ఎస్ నిర్వహించరన్నారు.ఈ మేరకు అర్జీదారులు గమనించాలన్నారు.

డీసీహెచ్ఎస్ పద్మశ్రీరాణి బదిలీ?

కొవ్వూరు,మార్చి 30 (ఆంధ్రజ్యోతి) తూర్పుగోదావరి జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారిని డా.ఎన్.పద్మశ్రీరాణి బదిలీపై విజయనగరం వెళ్లనున్నారు. రాష్ట్రంలో 8 మందికి డీసీహెచ్ఎస్‌లుగా పదోన్నతి కల్పిస్తూ ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో పద్మశ్రీరాణి బదిలీపై వెళ్లనున్నారు. ఆమె స్థానంలో పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం నుంచి డా. హెచ్.పద్మ రానున్నట్టు సమాచారం. అధికారికంగా ఉత్తర్వులు వెలువడాల్సి ఉంది.

మెగా ప్రాజెక్టులు.. పడక!





చూసే వారు లేక : ఆదుర్రులో పూర్తయిన తరువాత నిరుపయోగంగా వదిలేసిన పర్యాటక భవనం

ఎవరికి పట్టింది : ముక్కలవుతున్న చెక్క వంతెన

పర్యాటకులను మంత్రముగ్ధులను చేసే లక్ష్యంతో కోట్ల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న పర్యాటక భవనాలు వినియోగంలోకి రాకుండానే శిథిలావస్థకు చేరుతున్నాయి. సర్వాంగ సుందరంగా నిర్మాణాలు పూర్తి చేసిన భవనా లను పర్యాటకుల సౌకర్యార్థం వినియోగంలోకి తీసుకురావడంలో పర్యాటకశాఖ అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారు. నిర్మాణ సమయాల్లోనే నిధులు కాజేస్తూ ఆ తర్వాత భవన సముదాయాలను గాలికి వదిలేస్తున్నారు.. సుమారు పదేళ్ల కిందట కేంద్ర పర్యాటక మంత్రిగా ఉన్న చిరంజీవి సుమారు రూ.27 కోట్ల వ్యయంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రారంభించిన పనులు ఎక్కడికక్కడ అటకె క్కాయి.. చాలా భవనాలు ప్రారంభించకుండానే శిథిలమై దీనంగా చూస్తున్నాయి.. ప్రస్తుత ప్రభుత్వంలో డిప్యూటీ సీఎంగా ఉన్న పవన్ కల్యాణ్ మెగా పర్యాటక ప్రాజెక్టులపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

పర్యాటక శాఖ తీవ్ర నిర్లక్ష్యం

- చిరంజీవి ప్రాజెక్టులపై చిన్నచూపు
- పదేళ్ల కిందట పర్యాటక పనులు
- నాడు కేంద్ర మంత్రిగా శంకుస్థాపన
- ఉమ్మడి జిల్లాలో సాగని నిర్మాణాలు
- రూ.25 కోట్లతో ఆరంభం
- కోనసీమలో అయితే దారుణం
- కాకినాడలో అటకెక్కిన నిర్మాణం
- తూర్పున పునాది దాటని వైనం

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

మెగా ప్రాజెక్టులు పడకేశాయి.. ఒక్కచోట కూడా పరిస్థితి సంతృప్తికరంగా లేదు.. కాకినాడ జిల్లాలో జిల్లాలో స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయింది..కోనసీమ జిల్లాలో భవన నిర్మా ణాలు పూర్తయినా పర్యాటక అధికారుల నిర్లక్ష్యం కారణంగా శిథిలావస్థకు చేరుతున్నాయి. ఇక తూర్పు గోదావరి జిల్లా కడియపులంకలో చేపట్టిన ఎకో టూరిజం ప్రాజెక్టు పునాది దశను దాటలేదు. ఇలా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మెగా ప్రాజెక్టులు పడకేశాయి.కాకినాడ జిల్లాలో స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ కలగానే మారింది. శంకుస్థాపన చేసి పదేళ్లు పూర్తయినా ఇప్పటికీ ప్రారంభానికి నోచుకోక వెక్కిరిస్తోంది. 2015లో కేంద్ర ప్రభుత్వం ఇక్కడ సంస్థ ఏర్పాటుకు రూ.12 కోట్లు నిధులివ్వడానికి ముందుకు వచ్చింది. అప్పటి నుంచి ఇప్పటివరకు భవన నిర్మాణ పనులు సా...గుతూనే ఉన్నాయి. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో రాష్ట్రవిభజన సమ యంలో కేంద్ర ప్రభుత్వం హోటల్ మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ మంజూరు చేసింది. అప్పట్లో కేంద్ర పర్యాటకశాఖ మంత్రిగా ఉన్న చిరంజీవి దీన్ని జిల్లాకు కేటాయించారు. కేంద్రం నుంచి రూ.12 కోట్లు నిధులు మంజూరయ్యాయి. 2015 ఏప్రిల్‌లో పిఠాపురం నియోజకవర్గం పరిధిలోని ఉప్పాడ కొత్తపల్లిలో హైస్కూలుకు చెందిన 16 ఎకరాల స్థలం కేటాయించారు.కొందరు భూమి కేటాయింపుపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ కోర్టును ఆశ్రయించడంతో మూడు ఎకరాలు కేటాయించేలా న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసి వివాదానికి ముగింపు పలికింది.ఇది జరిగి దాదాపు ఐదేళ్లపైనే దాటిపోయింది.అయినా ఇప్పటికీ నిర్మాణానికి నోచుకోకుండా వెక్కిరిస్తోంది. కాకినాడతో పాటే తిరుపతిలో కేంద్రం నిధులతో రాష్ట్రపర్యాటక అభివృద్ధి సంస్థ నిర్మించిన హోటల్ మేనేజ్‌మెంట్ విద్యాసంస్థ అద్భు తంగా రాణిస్తోంది.ఇక్కడ మాత్రం ఇంకా ఆరంభం కాకుండా అలాగే ఉంది. సార్వత్రిక ఎన్నికలకు కొన్ని నెలల ముందు రాష్ట్ర పర్యాటక అభి వృద్ధి సంస్థ కళ్లు తెరిచి దీన్ని పూర్తి చేయడానికి రూ.6.74 కోట్లతో టెండర్లు పిలిచింది.ఒక కాంట్రాక్టర్ పనులు ఆరంభించినా తర్వాత బిల్లులు ఆగిపోవడంతో భవనాల పనులు మధ్యలో వదిలేశారు. కూటమి ప్రభుత్వం దృష్టి సారించి సీఎం చంద్రబాబు,ప్రస్తుత పిఠాపురం ఎమ్మెల్యే, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నిర్మాణాలపై దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.దీనిపై పర్యాటక శాఖ డీఈని వివరణ కోరగా భవనానికి కేంద్రం నుంచి నిధులు రావాల్సి ఉందన్నారు. హాస్టల్ భవనాల పనులు త్వరలో ఆరంభిస్తామన్నారు.



ఇంతేనా : ఉప్పాడ కొత్తపల్లిలో అసంపూర్తిగా వదిలేసిన హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల భవనం

అందంగా కట్టారు.. శిథిలస్థితికి చేర్చారు!

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

పర్యాటక శాఖ నిర్లక్ష్యం కారణంగా పలు ప్రా జెక్టులు ముందడుగు పడడంలేదు. నిధులున్నా నీరసంగా నడుస్తున్నాయి. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని మామిడికుదురు మండలం ఆదుర్రు బౌద్ధస్థూపం సమీపంలో నిరుపయోగంగా వదిలేసిన భవనాలు పర్యాటక శాఖ అధికారుల పనితీరుకు అద్దంపడుతున్నాయి.వైనతేయ నదీ తీరాన ఆదుర్రు బౌద్ధ స్థూపాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసే సంకల్పంతో తొమ్మిదేళ్ల కిందట రూ.6 కోట్లతో పర్యాటకుల విడిది భవనాలను నిర్మించారు. మడ అడవుల చెంతన ఓ వైపు గోదావరి మరో వైపు ఆదుర్రు బౌద్ధ స్థూపాలు ఉన్న ప్రాంతంలో వీటిని పర్యాటకశాఖ నిర్మించింది. పాశర్లపూడి నుంచి ఆదుర్రు బౌద్ధ స్థూపానికి నాలుగు కిలోమీటర్ల దూరం ఉంటుంది. పాశర్లపూడి వైపు వైనతేయ వంతెన కింద మరో భవనాన్ని నిర్మించారు.ఇక్కడి నుంచి ఆదుర్రుకు వైనతేయ నదిలో నాలుగు కిలోమీటర్ల మేర ప్రయాణించేందుకు రూ.కోటి పైబడిన వ్యయంతో అత్యాధునిక సౌకర్యాలతో కూడిన ఒక బోటు కొనుగోలు చేశారు. పాశర్లపూడి వైపు ఉన్న పర్యాటక భవనాన్ని ప్రైవేటు వ్యక్తులకు లీజుకిచ్చామని చెబుతున్నా అవి ఉపయోగంలో లేవు. ఆధునిక సౌకర్యాలతో కొనుగోలు చేసిన బోటు ఉపయోగంలో లేదు. ఆదుర్రులో గోదావరి నది చెంత నుంచి పర్యాటక భవనాలకు చేరుకునేందుకు వీలుగా అందంగా చెక్కలతో నిర్మించిన వంతెన ఇప్పుడు శిథిలస్థితికి చేరింది. ఆ భవనాల్లో తుప్పలు, చెట్లు పెరిగిపోయాయి. రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన భవనాలను గాలికొదిలేయడంపట్ల పర్యాటకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భవనాలు గాలికొదిలేసిన పర్యాటక అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆరేళ్లకే.. నిండు నూరేళ్లు!

గౌతమి గోదావరి తీరాన నిర్మించిన భవనాలు శిథిలమవుతున్నాయి. కోటిపల్లి రేవు చెంతనే అప్పటి కేంద్ర పర్యాటక శాఖ మంత్రి చిరంజీవి కోటిపల్లి రేవులో భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.ఈ భవన నిర్మాణాలకు అప్పటి మంత్రి యనుమల రామకృష్ణుడు 2019 జనవరి 7న ప్రారంభించారు. కోటిపల్లి రేవులో రూ.2.14 కోట్లతో నిర్మించిన రెండు ప్రత్యేక భవనాలు ప్రారంభించి ఆరేళ్లు కావొస్తున్నా వినియోగంలోకి రాలేదు. పర్యాటకంగా అభివృద్ధి చెందితే కోటిపల్లి రేవు తీరప్రాంతం ఎంతో అభివృద్ధి చెందేది. రేవు చెంతనే కోటిఫలీశ్వరస్వామి ఆలయం, దగ్గరలో ద్రాక్షారామ భీమేశ్వరస్వామి ఆలయాలు ఉండడం, రేవులో నిత్యం వందల మంది ప్రయాణించడంతో ఎప్పుడూ ఈ ప్రాంతం కళకళలాడుతూ ఉంటుంది. కోట్లు వెచ్చించి ఖర్చు పెట్టి నిర్మించిన భవనాలు ఉపయోగించకపోవడంతో చెట్లు, తుప్పలు, పిచ్చిమొక్కలు పెరిగి నిరుప యోగంగా మారాయి.



అందంగా కట్టారు.. వదిలేశారు : కోటిపల్లి రేవులో నిరుపయోగంగా వదిలేసిన పర్యాటక భవనం

కడియంలో ఎకో నారాయణ?



పునాదిలోనే ఆగింది : కడియపులంకలో పునాది దాటని ఎకో టూరిజం ప్రాజెక్టు

కడియం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : పర్యాటక అభివృద్ధిలో భాగంగా కడియపు లంకలో ఆరం భమైన ఎకో టూరిజం ప్రాజెక్టు అటకెక్కింది. ఎకో టూరిజం భవన నిర్మాణానికి 2014 ఫిబ్రవరి 9న చిరంజీవి స్వయంగా శంకుస్థాపన చేశారు.కేంద్రం రూ.5 కోట్లు మంజూరు చేయ డంతో పనులు కూడా ప్రారంభించారు. ఇక ఈ ప్రాంతానికి టూరిజం శోభ వచ్చేసిందని ఆనందపడే లోపు పునాది దశలోనే ప్రాజెక్టు నిలిచిపోయింది. దశాబ్దకాలంగా ఎక్కడి నిర్మాణాలు అక్కడే ఆగిపోయాయి. గత వైసీపీ ప్రభు త్వంలో ఈ ప్రాజెక్టు వైపు చూసిన వారే కానరాలేదు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలని నర్సరీరైతులు కోరుతున్నారు.



నాడు మాట్లాడుతున్న మెగాస్టార్ చిరంజీవి





4న చిత్ర కళా వీధి ప్రదర్శన

రాజమహేంద్రవరం,మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఏప్రిల్ 4న రాజమహేంద్రవరంలో అమరావతి చిత్రకళా వీధి ప్రదర్శన నిర్వహించనున్నారు. ఇది ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనే తొలి ప్రదర్శన. ఇటువంటి వీధి ప్రదర్శన బెంగళూరులో చాలాకాలంగా జరుగుతుంది. రాజమహేంద్రవరంలోని దామెర్ల రామారావు ఆర్ట్ గ్యాలరీని అభివృద్ధి చేసి మరింత ప్రాచుర్యంలోకి తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది.దీనిలో భాగంగా రాష్ట్ర పర్యాటక మంత్రి కందుల దుర్గేష్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మక,సాంస్కృతిక సమితి ఛైర్‌పర్సన్ పొడపాటి తేజస్వి ఆధ్వర్యంలో అమరావతి చిత్రకళా వీధి ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నారు. రాజమహేంద్రవరంలో ఏప్రిల్ 4న ఉదయం 9 నుంచి సాయం త్రం 5 గంటల వరకూ ఆర్ట్స్ కాలేజీ నుంచి జీజీహెచ్ వరకూ సుమారు కిలో మీటరు మేర రోడ్డుకిరు వైపులా స్టాల్స్ ఏర్పాటు చేసి ప్రదర్శించనున్నారు. ఈ మేరకు మంగళవారం నుంచి ఏర్పాట్లు చేస్తారు. ఈ ప్రదర్శనకు సుమారు 500 చిత్ర, శిల్ప, హస్తకళాకారులు హాజరు కా నున్నారు.వీధి ప్రదర్శనలో వివిధ కళాకారుల చిత్రాలను విక్రయిస్తారు. వీటి ద్వారా వచ్చే ఆదాయాన్ని దామెర్ల రామారావు ఆర్ట్ గ్యాలరీ అభివృద్ధికి వినియోగించనున్నారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామ కృష్ణం రాజు, మంత్రి దుర్గేష్ హాజరవుతారు.



పి-4కు తరలిన బస్‌లు

రాజమహేంద్రవరం, మార్చి30(ఆంధ్రజ్యోతి) : జీరో పావర్టీ - పి4 మార్గదర్శి (బంగారు కుటుంబం) పేరుతో అమరావతిలో ఆదివారం రాత్రి సీఎం నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో నిర్వహించనున్న కార్యక్రమానికి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి 13 బస్సుల్లో 500 మంది బయలుదేరి వెళ్లారు. రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు 20 శాతంగా ఉన్న పేదలకు 10 శాతంగా ఉన్న సంపన్న వర్గాల ద్వారా సహాయం చేసి అభివృద్ధిలోకి తీసుకుని రావడానికి పీ-4 కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. రాజమహేంద్రవరం ఆనం కళాకేంద్రం వద్ద ఆదివారం ఈ బస్సులను కలెక్టర్ పి.ప్రశాంతి ప్రారంభించారు.

అనపర్తి మండలం రామవరంలో పలువురు వైసీపీ నాయకులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఉగాదిని పురస్కరించుకుని కార్మిక శాఖ మంత్రి సుభాష్ సమక్షంలో ఎంపీటీసీ సభ్యులు తదితర నాయకులు టీడీపీలో చేరారు. ఆయా నాయకులకు మంత్రి సుభాష్ టీడీపీ కండువాలు కప్పి నియోజకవర్గ కన్వీనర్ మనోజ్‌రెడ్డి సమక్షంలో పార్టీలోకి ఆహ్వానించారు.



కడియంలో శాంతిర్యాలీ



పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతికి సంతాపంగా ఆదివారం కడియంలో భారీ శాంతి ర్యాలీ చేశారు.. సుమారు 2 వేల మంది క్రైస్తవులు తరలివచ్చారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని పెద్ద ఎత్తున ప్రార్థనలు చేశారు..

పాస్టర్ ప్రవీణ్ మృతిపై లోతైన దర్యాప్తు జరపాలి


గోపాలపురంలో మోకాళ్లపై ప్రార్థన చేస్తున్న దైవజనులు

గోపాలపురం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతికి సంతాపంగా ఆదివారం మండల కేంద్రం గోపాలపురంలో పాస్టర్లు భారీ శాంతి ర్యాలీ నిర్వహించారు. మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీ పెద్దగూడెం లూథరన్ చర్చ్ నుంచి ప్రారంభమై బస్టాండ్ మీదుగా చెక్ పోస్టు సెంటర్ వరకు జరిగింది. అనంతరం మానవహారంగా ఏర్పడి పాస్టర్ ప్రవీణ్ ఆత్మకు శాంతి కలగాలని మోకాళ్లపై ప్రార్థించారు. ఈ సందర్భంగా పలువురు దైవజనులు మాట్లాడుతూ ప్రవీణ్ పగడాల మృతి పట్ల ప్రభుత్వం నిస్వార్థంగా లోతైన దర్యాప్తు జరిపాలన్నారు. కార్యక్రమంలో మండల ఫెలోషిప్ పాస్టర్లు, విశ్వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వేసవిలో దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు


కొవ్వూరులో మజ్జిగ పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రత్నకుమారి, కమిషనర్ నాగేంద్రకుమార్

కొవ్వూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి ఆటోడ్రైవర్లు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి అన్నారు. ఆదివారం కొవ్వూరు బస్టాండ్ సెంటర్ చాగల్లు పాయింట్‌లో ఆదర్శ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని చైర్‌పర్సన్ రత్నకుమారి, కమిషనర్ టి.నాగేంద్రకుమార్ ప్రారంభించి మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కంటమణి రమేష్‌బాబు, ఆటో యూనియన్ అధ్యక్షుడు కమిడి శ్రీను, పి.శ్రీనివాసరావు, బట్టు మోసే, మాసా సురేష్, వి.గణపతి. ఆర్.శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చాగల్లు: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ, స్థానిక పంచాయతీ వారు సంయుక్తంగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. సేవాభావంతో పలు కార్యక్రమాలు నిర్వహిస్తూ అందరి మన్ననలను పొందుతున్న మానవత సంస్థను పలువురు అభినందించారు. ఉగాది ప్రసాదంతో పాటు మజ్జిగ వితరణతో ప్రారంభించిన చలి వేంద్రంలో ప్రతి రోజు దాతల సహకారంతో మజ్జిగ వితరణ చేస్తారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.మెరికమ్మ, ఏఎంసీ మాజీ చైర్మన్ ఆళ్ల హరిబాబు, కరుటూరి సతీష్, ఆళ్ళ జానకి రామారావు, కేవీ శ్రీనివాసరావు, ఏవీ సత్యనారాయణ, ఆలపాటి లక్ష్మణరావు, జేవీ కృష్ణప్రసాద్, రావిపాటి రాధాకృష్ణ, ఆలపాటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


చాగల్లులో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

పెనకనమెట్టలో వాలీబాల్ టోర్నమెంట్


పోటీల ప్రారంభోత్సవంలో ఎంపీటీసీ తాతారావు

కొవ్వూరు, మార్చి 30(ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు పోటీలలో గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలని ఎంపీటీసీ సభ్యులు పసలపూడి తాతారావు అన్నారు. మండలంలోని పెనకనమెట్ట గ్రామంలో ఉగాది పండుగను పురస్కరించుకుని ఫార్మర్స్ యూత్ ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నమెంటును ఏర్పాటుచేశారు. గ్రామ ఎంపీటీసీ తాతారావు ముఖ్యఅతిదిగా పాల్గొని వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా టోర్నమెంటు నిర్వాహకులు మాట్లాడుతూ ఈ టోర్నమెంట్లో మొత్తం 20 టీములు పాల్గొంటున్నాయని, ఫ్లడ్‌లైట్ల వెలుతురులో నాకౌట్ పద్దతిలో డే అండ్ నైట్ మ్యాచ్‌లు జరుగుతాయన్నారు. మొదటి మ్యాచ్ జతిన్ వారియర్స్ అంజి రాక్స్‌లు తలపడ్డాయి. ఈ కార్యక్రమంలో తోట శివ, ఎంపీటీసీ పసలపూడి తాతారావు, అచ్చుతరాయుడు, ముత్యాల రాంబాబు, గొల్లపల్లి పోసిబాబు, మైగాపుల బాలు, ఎలిబండి చంటీ, కోడి రాంబాబు, కొలిశెట్టి నరసింహ, రాజు, కోడి బాలాజీ, గంగుమళ్ళ స్వామి పాల్గొన్నారు.

నిర్మలగిరి అన్నదాన ట్రస్ట్‌కు రూ.లక్ష విరాళం


జాన్‌పీటర్‌కు విరాళం అందజేస్తున్న కిరణ్‌కుమార్

దేవరపల్లి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని గౌరీపట్నంలో నిర్మలగిరి మేరీమాత పుణ్యక్షేత్రంలో నిత్య అన్నదాన ట్రస్ట్‌కు విజయవాడకు చెందిన విద్యుత్‌శాఖ ఏఈ దాసరి కిరణ్‌కుమార్, శ్రీవిద్య దంపతులు రూ.లక్ష విరాళం పుణ్యక్షేత్ర డైరెక్టర్ జాన్‌పీటర్, అన్నదానట్రస్ట్ కాంట్రాక్టర్ కళ్లే నాగేశ్వరరావుకు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ దాసరి పాండురంగా, సాతులూరి వెంకటనర్సయ్య జ్ఞాపకార్థం విరాళం అందజేశామన్నారు. ఈ సందర్భంగా విరాళం అందజేసిన కిరణ్‌కుమార్‌ను పుణ్యక్షేత్ర డైరెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో దాసరి కిరణ్‌కుమార్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ

దేవరపల్లి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీపురంలో వంద ముస్లిం కుటుంబాలకు టీడీపీ నాయకులు మెంటిమి అమరావతి, సురేశ్ దంపతుల ఆధ్వర్యంలో ఈ రంజాన్‌తోఫా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అల్లా ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలపై ఎల్లప్పుడు ఉండాలని కోరారు. ముస్లింలు రంజాన్ పండుగను సంతోషంగా జరుపుకోవాలని అన్నారు. కార్యక్రమంలో బొల్లిన శ్రీధర్(బాబి), యర్రగొల్ల వెంకటేశ్వరరావు, పాకా అర్జున్, పెరవలి వెంకటేశ్వరరావు, పటాన్ కమల్, షేక్ దాదా, పటాన్ బాజీ పాల్గొన్నారు.


లక్ష్మీపురంలో రంజాన్‌తోఫా అందజేస్తున్న టీడీపీ నాయకులు

ఉగాది వేడుకలు

నల్లజర్ల, మార్చి 30(ఆంధ్రజ్యోతి): విశ్వవసు నామ సంవత్సర ఉగాది వేడుకలు మండలంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక శ్రీరామకృష్ణ మందిరంలో జరిగిన కార్యక్రమాలకు మాజీ హోం మంత్రి తానేటి వనిత ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఆమెకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఉదయం నుంచి ఆలయంలో లక్ష్మీనారాయణులకు ప్రత్యేక పూజలు చేశారు. ఇక్కడ నిర్వహిస్తున్న సప్త సప్తాహ హనుమాన్ చాలీసా పారాయణం 33వ రోజు కార్యక్రమంలో వనిత పాల్గొన్నారు. అలాగే గ్రామ దేవత సోమాలమ్మ 31వ వార్షికోత్సవాన్ని ప్రారంభించారు. భక్తులకు మజ్జిగ, పుచ్చకాయ ముక్కలు పంపిణీ చేశారు.

పరస రాధాకృష్ణకు ఉగాది పురస్కారం


రాధాకృష్ణను సత్కరిస్తున్న ఎంపీ పురందేశ్వరి

తాళ్లపూడి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): టీటీడీ హిందూ ధర్మ ప్రచారక్ పరస రాధాకృష్ణకు ఉగాది పురస్కారం లభించింది. తాళ్లపూడికి చెందిన ఆధ్యాత్మిక పురాణ ప్రవచకుడు, విశ్రాంత ఉపాధ్యాయుడు, జయధ్వని పత్రిక ఎడిటర్, సభా వ్యాఖ్యాతగా వ్యవహరించే రాధాకృష్ణను రాజమహేంద్రవరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీ పురందేశ్వరి సత్కరించి మెమెంటో అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు ఇండుగుల రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రాచీన ఆలయాలకు పోటెత్తిన భక్తులు

బిక్కవోలు, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ఉగాది పర్వదిన సందర్భంగా ఆదివారం బిక్కవోలులోని ప్రాచీన ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి బారులు దీరి లక్ష్మీగణపతిని, గోలింగేశ్వర, కుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు. రాజానగరం బీజేపీ ఇన్‌చార్జి నీరుకొండ వీరన్నచౌదరి లక్ష్మీగణపతిని దర్శించుకుని పూజలు చేశారు. ఆయన వెంట పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు ఉన్నారు.

నూతనోత్సాహం


తాళ్లపూడిలో మోదుగులమ్మ ఆలయం వద్ద గరగ నృత్యాలు


కుమారదేవం గండిపోశమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యే ముప్పిడి

- భక్తిశ్రద్ధలతో ఉగాది వేడుకలు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- షడ్రుచుల పచ్చడి పంపిణీ
- దేవాలయాల్లో పంచాంగ శ్రవణం

కొవ్వూరు, మార్చి 30(ఆంధ్రజ్యోతి): శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. కొవ్వూరులోని మెయిన్ రోడ్‌లో జూనియర్ కాలేజ్ వద్ద, గోదావరి గట్టుపై భక్తాంజనేయ స్నానఘట్టం వద్ద గ్రామ దేవత కొవ్వూరమ్మ ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గరగనృత్యాలు ఏర్పాటు చేశారు. రెల్లిపేటలో కనకదుర్గ, నూకాలమ్మ, మెయిన్‌రోడ్‌లో పుంతలో ముసలమ్మ, గోష్పాదక్షేత్రంలోని బాలాత్రిపుర సుందరి, సంస్కృత పాఠశాల లలితాపార్వతీ అమ్మవారి ఆలయాలను అలంకరించి విశేష అర్చనలు, పూజలు చేశారు. వేకువజాము నుంచి భక్తులు ఆలయాలకు చేరుకుని బారులు తీరి అమ్మవారికి నేవేద్యాలు, మొక్కులు సమర్పించారు. స్థానిక ఫ్యాక్టరీ రోడ్‌లోని నూకాలమ్మ ఆలయంలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, ద్విసభ్య కమిటీ సభ్యులు కంట మణి రామకృష్ణారావు, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్ తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముప్పిడి మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలందరికి ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. షడ్రుచుల సమ్మేళనమైన ఉగాది ప్రతిఒక్కరి జీవితంలో శుభాలను, ఆనందాన్ని కలగజేయాలన్నారు. అలాగే మున్సిపల్ కార్యాలయం ఎదుట ఉన్న కనకదుర్గమ్మ ఆలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, కమిషనర్ టి.నాగేంద్రకుమార్, కౌన్సిలర్ కంటమణి రమేష్‌బాబులు పూజలు చేశారు. కుమారదేవం గ్రామంలో గండిపోశమ్మ ఆలయం వద్ద ఉగాది ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరీ, ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అమ్మవారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పండితులు వేద ఆశీర్వచనాలు అందించి, అమ్మవారి చిత్రపటాలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు, మద్దిపట్ల శివరామకృష్ణ, సూరపనేని చిన్ని, వట్టికూటి వెంకటేశ్వరరావు, గంద్రోతు పవన్ పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: భక్తులు మండలంలోని పలు దేవాలయాల్లో పూజలు చేశారు. తాడిపర్రు, ఉండ్రాజవరం, వేలివెన్ను గ్రామాల్లో పంచాంగ శ్రవణం చేశారు. పాలంగిలో కనకదుర్గమ్మ ఆలయంలో భక్తులు పూజలు చేశారు. పాలంగిలోని ధ్వజస్తంభం వీధిలో కొండాలమ్మకు ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో సన్నాయి, వాయిద్యాలు, గరగ నృత్యాలతో ఊరేగించారు.

చాగల్లు: స్థానిక శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలోను, శివాలయంలోను ఉగాది వేడుకలు నిర్వహించి పంచాంగ శ్రవణం చేశారు. విశ్వావసు నామ సంవత్సరంలో ప్రజలు సుఖ సంతోషాలతో ఆనందంగా ఉంటారని రాష్ట్రానికి శుభం కలుగుతుందని వేదపండితులు లింగాల శ్రీనివాసశర్మ అన్నారు. కార్యక్రమంలో పురోహితుడు చెరుకూరి శివ సీతారామ్ శర్మ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

దేవరపల్లి: మండలంలోని అన్ని ప్రధాన ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామదేవత కడియాలమ్మ, డైమండ్ జంక్షన్ వద్ద గంగానమ్మ ఆలయాల ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం భారీ అన్నసమారాధన జరిగింది. స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. సాయంత్రం ఆలయం వద్ద పంచాంగ శ్రవణం నిర్వహించారు. మూడుబొమ్మల సెంటర్ వద్ద ఉన్న సౌభాగ్య దుర్గాంబిక, కడియాలమ్మ ఆలయాల వద్ద పంచాగ శ్రవణం జరిపారు.

తాళ్లపూడి: తాళ్లపూడిలో గ్రామ దేవత మోదుగులమ్మ ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఆడపడుచులు, బంధువుల రాకతో గ్రామంలో సందడి నెలకొంది. గ్రామంలోని మహిళలు గ్రామ దేవతకు గరగ నృత్యాలు, డప్పు వాయిద్యాలతో చీరె సారెలు సమర్పించారు. ఉదయం చల్ల ఘటం, సాయంత్రం శిరిబొమ్మ ఉత్సవం సందర్భంగా గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వేగేశ్వరపురంలో గ్రామ దేవత ధనమ్మ తల్లికి ఉత్సవాన్ని నిర్వహించారు. పంట పొలాల్లో ఉండే ఈ ఆలయానికి చుట్టు పక్కల గ్రామాల ప్రజలు చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం కమిటీ ఆధ్వర్యంలో గరగలు, కేరళా నృత్యాలు ఏర్పాటు చేశారు.


తాడిపర్రులో పంచాంగ శ్రవణం వింటున్న భక్తులు


చాగల్లు సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో పంచాంగ శ్రవణం


దేవరపల్లిలో గంగానమ్మ ఆలయం వద్ద అన్నసమారాధన

'సామాజిక సమానత్వమే లక్ష్యం'


కొవ్వూరులో బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి, ఆర్డీవో సుస్మిత

- పీ4 కార్యక్రమానికి అమరావతి తరలిన ప్రజలు

కొవ్వూరు, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ప్రతి కుటుంబం ఆనందంగా జీవనం గడపాలని ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. వెలగపూడి సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు నిర్వహించే పీ4 కార్యక్రమానికి ఆదివారం కొవ్వూరు ఆర్డీవో కార్యాలయం నుంచి బయలుదేరుతున్న బస్సును ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, ఆర్డీవో రాణి సుస్మిత జెండా ఊపి ప్రారంభించారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 2040 నాటికి రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని సీఎం చంద్రబాబు పీ4 విధానాన్ని తీసుకొచ్చారన్నారు. రాష్ట్రంలో ఆర్థికంగాను, సామాజికంగాను వెనుకబడిన వారిని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్లాలని పీ4 విధానాన్ని అమలు చేయనున్నట్టు చెప్పారు. నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఉత్తమంగా తీర్చిదిద్దడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా సహకరించాలన్నారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యుడు కంటమణి రామకృష్ణారావు, తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్, సూరపనేని చిన్ని, దాయన రామకృష్ణ, సూర్యదేవర రంజిత్, ఏపీఎం కె.విజయనిర్మల పాల్గొన్నారు.

చాగల్లు: మండలంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన పలువురు అమరావతికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సులో తరలి వెళ్లారు. బస్సును ఏఎంసీ మాజీ చైర్మన్ ఆళ్ల హరిబాబు, టీడీపీ మండలాధ్యక్షుడు నాదెళ్ల శ్రీరామ్‌చౌదరి జెండా ఊపి ప్రారంభించారు. తహశీల్దార్ ఎం.మెరికమ్మ మాట్లాడుతూ సామాజిక సమానత్వం కోసం ప్రభుత్వం ప్రారంభిస్తున్న మంచి కార్యక్రమం పీ4 అని అన్నారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు,నాయకులు పాల్గొన్నారు.

గోపాలపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి అమరావతిలో జరిగే పీ4 కార్యక్రమానికి వెళ్తున్న బస్సును టీడీపీ మండలాధ్యక్షుడు రొంగలి సత్యనారాయణ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం సంకల్పించిన పీ4 కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. అమరావతి సచివాలయ పీ4 కార్యక్రమానికి మండలం నుంచి సుమారు 40 మంది వెళ్లినట్టు ఆయన చెప్పారు. కార్యక్రమంలో తహశీల్దార్ అజయ్‌బాబు, ఏపీఎం రోజ్ మాణిక్యం, వీఆర్వోలు శ్రీను, లక్ష్మీ, నాయకులు కూనపం ప్రసాద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


గోపాలపురంలో బస్సును ప్రారంభిస్తున్న సత్యనారాయణ

నేడు ఉగాది పురస్కారాలు

చాగల్లు, మార్చి 30(ఆంధ్రజ్యోతి): సుంకవల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగే ఉగాది పురస్కారాలు సోమవారం మార్కొండపాడు శ్రీనిలయంలో మధ్యాహ్నం 3గంటలకు జరుగుతాయని సుంకల్లి వెంకన్నచౌదరి, శేషకుమారి ఓ ప్రకటనలో తెలిపారు. సుంకవల్లి వెంకటరత్నం మెమోరియల్ ట్రస్టు తరుపున 17వ వార్షిక ఉగాది పురస్కారాలు అందజేస్తున్నట్టు చెప్పారు. ఉత్తమ రైతులు, విద్యార్థులు, అధికారులను గౌరవిస్తూ జరిగే పురస్కారాలకు ముఖ్యఅతిథిగా మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరావు పలువురు ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు.

కోడి పందాలు ఆడుతున్న ఆరుగురు అరెస్టు

కొవ్వూరు, మార్చి 30(ఆంధ్రజ్యోతి): కోడి పందాలు ఆడుతున్న ఆరుగురిపై కేసులు నమోదు చేసినట్టు సీఐ పి.విశ్వం తెలిపారు. ఆదివారం మండలంలోని ఆరికిరేవుల గ్రామ శివారులో కోడి పందాలు ఆడుతున్న శిబిరంపై దాడిచేసి నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.900 నగదు, 1 కోడిపుంజు, 1 కోడికత్తి స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే వాడపల్లిలో కోడి పందాలు ఆడుతున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టుచేసి, వారి నుంచి రూ.1780 నగదు, 1 కోడిపుంజు, 1 కోడికత్తి స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్టు సీఐ పేర్కొన్నారు.

హ్యాండ్ రైటింగ్‌లో విద్యార్థుల ప్రతిభ

నల్లజర్ల, మార్చి 30(ఆంధ్రజ్యోతి): యూనివర్సల్ హ్యాండ్ రైటింగ్ అకాడమీ నిర్వహించిన హ్యాండ్ రైటింగ్ పోటీల్లో నల్లజర్ల సెయింట్ క్లారెట్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్టు ప్రిన్సిపాల్ జోషప్ శాంతప్ప తెలిపారు. ఇందుకు సంబంధించిన సర్టిఫికెట్స్ ఆదివారం స్కూల్‌కి అందినట్టు చెప్పారు. ఈ పోటీల్లో 9వ తరగతి చదువుతున్న జె.గయని ప్రియా ప్రథమ స్థానం సాధించగా 3వ తరగతి చదువుతున్న పి.ఇందు ద్వితీయ స్థానం సాధించిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు.

గోలింగేశ్వరుడికి లక్షపత్రి పూజ


గోలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న పండితులు

నిడదవోలు, మార్చి 30(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీ రాజరాజేశ్వరి సమేత గోలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం లక్షపత్రి పూజ ఆలయ ప్రధానార్చకుడు శ్రీకాకుళపు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వేద పండితులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచి గణపతి పూజ, లక్ష బిల్వార్చన, రాజరాజేశ్వరి దేవికి కుంకుమ పూజలు జరిపారు. స్వామి అమ్మవార్లను భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.

కొవ్వూరులో ఆర్‌ఎస్ఎస్ పదసంచలన్


కొవ్వూరులో పదసంచలన్ చేస్తున్న ఆర్‌ఎస్ఎస్ కార్యకర్తలు

కొవ్వూరు, మార్చి 30(ఆంధ్రజ్యోతి): కొవ్వూరులో రాష్ట్రీయ స్వయం సేవక్ (ఆర్‌ఎస్ఎస్) కార్యకర్తలు కవాతు నిర్వహించారు. స్థానిక సంస్కృత పాఠశాల ప్రాంగణంలో ఆదివారం ఆర్‌ఎస్ఎస్ ప్రారంభకుడు డాక్టర్ కేశవరావు బలిరాం హెడ్గే జన్మదినం, ఉగాది ఉత్సవాన్ని నిర్వహించారు. సంస్కృత పాఠశాల నుంచి భారతమాత చిత్రపటంతో ఇందిరమ్మకాలనీ, బస్టాండ్, విజయవిహార్ సెంటర్, ఎల్‌సి మీదుగా పదసంచలన్ నిర్వహించారు. అనంతరం పాఠశాల కళా వేదికపై ఉగాది ఉత్సవాన్ని నిర్వహించారు. బలుసు సత్యనారాయణ మాట్లాడుతూ ఆర్‌ఎస్ఎస్ ఆవిర్భవించి వందేళ్లు పూర్తయ్యిందన్నారు. ఆర్‌ఎస్ఎస్ ఆవిర్భావం, హిందూ ధర్మాన్ని వివరించారు. కార్యక్రమంలో న్యాయవాది కల్లూరి సుబ్రహ్మణ్యం, కొవ్వూరు ఖండ కార్యవాహక్ గోవర్ధనం శ్రీనివాసమూర్తి, ఆర్‌ఎస్ఎస్ ఖండ ప్రముఖులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఉత్కంఠభరితంగా ఎడ్ల పట్టు ప్రదర్శన పోటీలు


నందన్న రోడ్డులో పరుగుదీస్తున్న ఎడ్లజత

- చక్రద్వారబంధం ఎడ్ల జతకు ప్రథమ స్థానం
- విజేతలకు నగదు బహుమతి, జ్ఞాపికల అందజేత

కడియం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ఉగాది సందర్భంగా మురమండలోని దుళ్ల రోడ్డులో నందీశ్వరస్వామి ఆలయం వద్ద ఎడ్ల పట్టు ప్రదర్శన పోటీలు ఉత్సాహంగా, ఉత్కంఠ భరితంగా జరిగాయి. పోటీలను టీడీపీ రాష్ట్ర వైద్యవిభాగం ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవిరామ్‌కిరణ్ గోరంట్ల తిలకించారు. 150 కిలోల బరువుతో, 110 గజాల దూరం పట్టు ప్రదర్శన పోటీలు నిర్వహించారు. రాజానగరం మండలం చక్రద్వారబంధంకు చెందిన ముంగర నాగేశ్వరరావు ఎడ్లు ప్రథమ, ఆలమూరు మండలం మూలస్థానం గ్రామానికి చెందిన మురమళ్ల రాంబాబు ఎడ్లు ద్వితీయ, కడియం మండలం మురమండ గ్రామానికి చెందిన మిద్దే సురేష్ ఎడ్లు తృతీయ స్థానాల్లో నిలిచాయి. విజేతలకు నగదు బహుమతి, జ్ఞాపికలు అందజేశారు. అలానే పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. మొగలపు వెంకట రామకృష్ణారావు, ఐ.వెంకటేశ్వరరావు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.


పోటీలను తిలకిస్తున్న డాక్టర్ రవిరామ్‌కిరణ్